# ప్రజా [illegible]

తెలంగాణ జాతీయ దినపత్రిక

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు

ప్రచురణ : జగిత్యాల | సంపుటి : 07 | సంచిక : 18 | శుక్రవారం 11 - 09 - 2026 | పేజీలు : 04 | వెల రూ. 2





ఢిల్లీలో బ్రిక్స్ సదస్సు.. సర్వం సిద్ధమన్న ప్రధాని మోదీ

## కొందరు కాంగ్రెస్ నుంచి ఎదిగి కాంగ్రెస్‌కే నష్టం చేయాలని చూస్తున్నారు

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- అసెంబ్లీ కమిటీ హాల్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సీఎల్పీ సమావేశం జరిగింది
- ఈ సమావేశంలో సభ్యులకు సీఎం దిశానిర్దేశం చేశారు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు ఈ భేటీలో పాల్గొన్నారు



**హైదరాబాద్ :**

ప్రభుత్వం వెయ్యి రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా తీసుకున్న నిర్ణయాలు, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు వివరించాలని సభను నిర్వహిస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ సభను సజావుగా జరగకుండా కుట్ర చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ కమిటీ హాల్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సీఎల్పీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సభ్యులకు సీఎం దిశానిర్దేశం చేశారు. ఈ భేటీలో డిప్యూటీ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.అధికారం పోయినా అహంకారం వీడకుండా పోలీసు అధికారులను, ప్రజా ప్రతినిధులను దూషించి మూడు రోజులు సభను సజావుగా జరగకుండా చేశారని బీఆర్ఎస్ నేతలను రేవంత్ రెడ్డి విమర్శించారు. అధికారులపై అనుచితంగా వ్యవహరించడం, మహిళా అధికారుల ముందు టీషర్టులు విప్పి ఇబ్బంది కలిగించారని, శాసన సభాపతిని అత్యంత అభ్యంతరకరంగా దూషించారని మండిపడ్డారు. నిరసన తెలిపేందుకు ఎస్సీ సెల్ కార్యక్రమం చేపడితే దళితులు నడిచిన నేలను శుద్ధి చేసి అవమానించారని గుర్తు చేశారు. ప్రతిపక్ష కుట్రను బలంగా తిప్పి కొట్టి, ప్రభుత్వంపై జరిగిన కుట్రను ప్రజలకు తెలియజేసినందుకు సభ్యులకు సీఎం అభినందనలు తెలిపారు.సభ్యులు తప్పనిసరిగా సభలో చర్చల్లో పాల్గొనాలని, సభలో హాజరు శాతం తగ్గకుండా చూసుకోవాలని సూచించారు. ప్రజలు ఇచ్చిన హోదాను సరైన విధంగా ఉపయోగించుకోకపోతే - మిగతా 2 లో

## దుష్ప్రచారాలు నమ్మొద్దు



- గణేశ్ నిమజ్జనాలపై హైడ్రా చీఫ్ రంగనాథ్
- గణేశ్ విగ్రహాల నిమజ్జనానికి హైడ్రా వ్యతిరేకం కాదన్న రంగనాథ్
- సున్నితమైన చెరువుల వద్ద మాత్రమే ఆంక్షలు అమలులో ఉన్నాయని వెల్లడి
- అన్ని చెరువులు, జలాశయాల్లో నిమజ్జనాలు యథావిధిగా సాగుతాయని స్పష్టీకరణ



## ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్లపై ప్రభుత్వం దృష్టి సారించింది

- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- రాష్ట్రంలో రెన్యువబుల్ ఎనర్జీ రంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్న భట్టి
- ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ల కోసం శ్రీశైలం, సాగర్ తదితర రిజర్వాయర్లను పరిశీలిస్తున్నామని వెల్లడి

**హైదరాబాద్ :**

తెలంగాణలో పునరుత్పాదక శక్తి (రెన్యువబుల్ ఎనర్జీ) - మిగతా 2 లో

## భారత్ అమ్ములపొదిలో 190 అణు వార్‌హెడ్లు

- శత్రువులకు వణుకే!
- ప్రస్తుతం 730 కిలోల వెపన్ గ్రేడ్ ప్లుటోనియం ఉన్నట్లు అంచనా
- 140 నుంచి 225 వార్‌హెడ్లను తయారు చేయవచ్చని వెల్లడి
- భారత్ తన అణ్వాయుధ సామర్థ్యాన్ని క్రమంగా పెంచుకుంటోందన్న అమెరికా



**ఢిల్లీ :**

భారత్ తన అణ్వాయుధ సామర్థ్యాన్ని క్రమంగా పెంచుకుంటోందని అమెరికా పేర్కొంది. 'ఇండియాస్ న్యూక్లియర్ వెపన్స్-2026' పేరుతో ఫెడరేషన్ ఆఫ్ అమెరికన్ సైంటిస్ట్స్ డైరెక్టర్ హాన్స్ క్రిస్టెన్సెన్ ఓ కథనం రాశారు. భారత్ వద్ద 190 అణు వార్‌హెడ్లు ఉన్నట్లు అంచనా వేశారు. ఇందులో 160 ఆపరేషనల్ లాంచర్ల కోసం - మిగతా 2 లో

## అంతరిక్షం అందరిదీ బాధ్యత కూడా సమష్టిగా ఉండాలి




- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ
- పారిస్‌లో జరుగుతున్న అంతర్జాతీయ స్పేస్ సమ్మిట్‌లో మోదీ వర్చువల్ ప్రసంగం
- అంతర్జాతీయ చట్టాల ఆధారంగా సురక్షిత, శాంతియుత, సుస్థిర అంతరిక్ష వ్యవస్థకు భారత్ మద్దతు

**ఢిల్లీ :**

అంతరిక్ష రంగంలో భారత్ వైఖరిని మరోసారి స్పష్టం చేశారు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ. సురక్షితమైన, భద్రమైన, సుస్థిరమైన అంతరిక్ష వ్యవస్థకు భారత్ మద్దతు ఇస్తుందని తెలిపారు. అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా అంతరిక్ష కార్యకలాపాలు కొనసాగాలని పేర్కొన్నారు. పారిస్‌లో జరుగుతున్న అంతర్జాతీయ స్పేస్ సమ్మిట్‌ను గురువారం వర్చువల్‌గా ఉద్దేశించి ప్రధాని ప్రసంగించారు. అంతరిక్షం అందించే అవకాశాలకు హద్దులు లేవని, అయితే దానిపై మనందరి బాధ్యత ఉమ్మడిదేనని మోదీ పేర్కొన్నారు. భారత్ తదుపరి తరం అంతరిక్ష పరిశోధన, అభివృద్ధి కార్యక్రమాల్లో - మిగతా 2 లో

## మనం సృష్టించిన మేధస్సు మనల్నే మింగేస్తే

- ఏఐపై ఎందుకీ దిగ్గజాల హెచ్చరికలు
- ఏఐ మానవాళికి ముప్పుగా మారొచ్చంటూ నిపుణుల హెచ్చరిక
- ఏఐ సంస్థలు బాధ్యతగా వ్యవహరించడం లేదని ఆరోపణ
- ఏఐ నియంత్రణపై ఆందోళన వ్యక్తం చేస్తున్న మస్క్



2 లో..

## లాల్ మందిర్‌ను టార్గెట్ చేశారు ఎర్రకోట వద్ద పేల్చారు

- ఢిల్లీ బ్లాస్ట్ కేసులో కొత్త కోణం!
- 2025 ఢిల్లీ పేలుళ్లలో ఎర్రకోట ఉగ్రవాదుల అసలు లక్ష్యం కాదు
- చాందినీ చౌక్‌లోని లాల్ మందిర్ వద్ద దాడికి తొలుత ప్లాన్
- ట్రాఫిక్, భద్రత కారణంగా చివరి నిమిషంలో ప్రణాళిక మార్పు
- ఆత్మాహుతి దాడిలో 11 మంది మృతి.. 29 మందికి గాయాలు



**ఢిల్లీ :**

దేశ రాజధాని ఢిల్లీని 2025లో కుదిపేసిన ఎర్రకోట సమీపంలోని బాంబు పేలుడు ఘటనలో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) సంచలన విషయాలను - మిగతా 2 లో

## రివ్యూలు కాదు.. రిజల్ట్స్ కావాలి



- అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం
- రివ్యూలతో కాలయాపన వద్దు, ఫలితాలు చూపాలని కలెక్టర్లకు సీఎం స్పష్టీకరణ
- 'సీఈఓ' గుర్తింపు కన్నా 'వాటర్ మ్యాన్' అని పిలిపించుకోవడమే తనకు సంతృప్తి అన్న సీఎం
- నకిలీ ప్రచారాలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని, వాస్తవ నివేదికలు ఇవ్వాలని అధికారులకు సూచన

**అమరావతి :**

"గంటల తరబడి చేసే రివ్యూలు కాదు... నాకు క్షేత్రస్థాయిలో ఫలితాలు కావాలి. రియాక్టివ్ (ప్రతిస్పందించే) పాలన నుంచి ప్రో-యాక్టివ్ (చురుకైన) పాలన దిశగా అధికారులు మారాలి. ఆలోచనలు అద్భుతంగా ఉన్నా, వాటిని అమలు చేయకపోతే అవి నెరవేరని ఆశలుగానే మిగిలిపోతాయి" అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులకు స్పష్టమైన సందేశం ఇచ్చారు. రాష్ట్ర సచివాలయంలో గురువారం - మిగతా 2 లో



## నారా లోకేశ్ అడ్డంగా దొరికిపోయారు


- వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు
- డీఎస్సీ, ఏపీపీఎస్సీ పరీక్షల్లో భారీగా అక్రమాలు జరిగాయన్న అంబటి
- చంద్రబాబు, లోకేశ్ మౌనంగా ఉన్నారని మండిపాటు
- ఉద్యోగాలను లోకేశ్ బఠానీలు అమ్మినట్టు అమ్మేశారని విమర్శ

**అమరావతి :**

ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించిన డీఎస్సీ, ఏపీపీఎస్సీ పరీక్షల్లో ఎన్నడూ లేనంత స్థాయిలో - మిగతా 2 లో

## ఇగోలు పక్కనపెట్టి ప్రజాసేవకులుగా పని చేద్దాం

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- కలెక్టర్ల సదస్సులో అధికారులకు సీఎం దిశానిర్దేశం
- ఫైళ్లు పెండింగ్‌లో ఉంటే అభివృద్ధి, పాలన కూడా పెండింగ్‌లో ఉన్నట్టే అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు
- 27 నెలల్లో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టామని వెల్లడించారు
- ఫేక్ ప్రచారాలకు అధికారులు వేగంగా కౌంటర్ ఇవ్వాలన్నారు
- అమరావతిలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన 8వ జిల్లా కలెక్టర్ల సదస్సు




**అమరావతి :**

ఫైళ్లు పెండింగ్‌లో ఉంటే అభివృద్ధి, పాలన కూడా పెండింగ్‌లో ఉన్నట్టేనని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. గత ప్రభుత్వ మద్యం విధానం అక్రమాలను కలెక్టర్ల సదస్సులో సీఎం లేవనెత్తారు. వైఎస్సార్సీపీ హయాంలో మార్కెట్‌లోకి తెచ్చిన జే బ్రాండ్ కల్తీ మద్యం వల్ల 30 వేల మంది ప్రాణాలు కోల్పోయారని, వేలాది మంది ఆరోగ్యం దెబ్బతిందని ఆరోపించారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడిన ఆ కల్తీ మద్యం బ్రాండ్లన్నింటినీ రద్దు చేసి ఇప్పుడు పారదర్శకంగా, నాణ్యమైన మద్యం విక్రయాలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు.అమరావతిలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన 8వ జిల్లా కలెక్టర్ల సదస్సు జరుగుతోంది. సచివాలయంలోని ఐదో బ్లాక్‌లో రెండు రోజుల పాటు జరిగే ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్లు, మంత్రులు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ప్రిన్సిపల్ సెక్రటరీలు, విభాగాధిపతులు హాజరయ్యారు. తొలి రోజు నాయకత్వం, రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి (జీఎస్డీపీ), తాగునీరు, గృహనిర్మాణం, జలధారతో పాటు జిల్లాల్లో అమలు చేస్తున్న - మిగతా 2 లో

# సంపాదకీయం

## నిజరూప పట దర్శనం!

మాటలు కావొచ్చు, చేతలు కావొచ్చు-- ఏవీ శూన్యంనుంచి ఊడిపడవు. అనుద్దేశపూర్వకంగా, యథాలాపంగా ఏవీ ఉండవు. వాటిని ఉపయోగించేవారికి ఆ సంగతి తెలియొచ్చు... తెలియకపోవచ్చు. ఒక్కోసారి బాధితులకు కూడా అర్థం కాకపోవచ్చు. కానీ వివక్షను ఎత్తిచూపినప్పుడు సరిదిద్దుకోవటం సంస్కారం. ఈ విషయంలో వ్యక్తుల్ని కొంతవరకూ క్షమించవచ్చు. కానీ ప్రపంచ దేశాల సారథి ఐక్యరాజ్యసమితిని క్షమించగలమా? ప్రపంచ పటంలో మా ఖండాన్ని చిన్నబుచ్చుతున్నారని ఆఫ్రికా దేశాలు దశాబ్దాలుగా ఎత్తిచూపుతున్నాయి. అయినా దాన్ని సరిదిద్దుకోవటానికి దీర్ఘకాలం పట్టింది. ఎట్టకేలకు మొన్న శుక్రవారం దాన్ని సవరించుకుంది. ఏకంగా 164 దేశాలు తీర్మానానికి అనుకూలంగా ఓటేస్తే, ఎప్పట్లానే అమెరికా ఉలిపికట్టె ధోరణి ప్రదర్శించింది. ఎప్పుడో పదహారో శతాబ్దంనాటి మాట. భౌగోళిక పటాల రూపకర్త గెరార్డస్ మెర్కేటర్ తొలిసారి 1569లో ప్రపంచ పటాన్ని రూపొందించాడు. దక్షిణార్ధ గోళ దేశాలను, ముఖ్యంగా భూమధ్య రేఖ సమీప దేశాలను వాటి వాస్తవ పరిమాణంకన్నా తక్కువగా చూపాడాయన. అప్పటికున్న పరిజ్ఞానం పరిమితుల్లో అలా చేశాడని సరిపెట్టుకోవటానికి లేదు. అదే నిజమైతే ఉత్తరార్ధ గోళ దేశాలనూ, ధ్రువాలకు సమీపంలో ఉన్నవాటినీ పెంచి ఎలా చూపగలిగాడు? ఏమైతేనేం... ప్రపంచపటం ఇన్నాళ్లకు సక్రమమైంది. ఖండాలను వాటి నిష్పత్తికి అనుగుణమైన వైశాల్యాల్లో రూపొందించారు. కానీ ఆ క్రమంలో మన జమ్మూ కశ్మీర్, లద్దాఖ్ భూభాగంలోని కొన్ని ప్రాంతాలను ఆ పటం చైనా, పాకిస్తాన్‌లకు 'పంచిపెట్టింది'. మన విదేశాంగ శాఖ చెప్పినట్టు ఇదేమీ దేశాల హద్దుల్ని అధికారికంగా నిర్ధారించేది కాకపోవచ్చు. కానీ ఒక తప్పును సరిదిద్దుకునే క్రమంలో కొత్త తప్పుల్ని చేయరాదన్న ఇంగిత జ్ఞానం లోపించింది. అమెరికాలో కొంత భూభాగాన్ని వేరేవాళ్ల ఖాతాలో వేసి ఉంటే అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఊరుకునేవారా? అవతలివారిపై ఆధిక్యతాభావం మనిషి నరానరాల్లోనూ వ్యాపించిన జాడ్యం. దీనికి భౌగోళిక హద్దులేమీ లేవు. అది జాత్యహంకారంగా, వర్ణవివక్షగా, ఆర్థికంగా అధికులమనే భావనగా వ్యక్తం కావటం ఎవరికీ తెలియంది కాదు. కులాన్నిబట్టి, మతాన్నిబట్టి మేం అధికులం, అన్యులు అల్పులన్న భావన ప్రబలంగా ఉండటం మన అనుభవంలో ఉన్నదే. తెల్లతోలు ఉన్నవాళ్లు అసాధారణ మానవులు, మిగిలినవాళ్లంతా అల్పులనే భావన పాశ్చాత్య దేశాల్లో ఇప్పటికీ పోలేదు. హిట్లర్ హయాంలో యూదుల్ని జర్మనీ వెంటాడి, వేటాడి హతమార్చటం వెనుకా... ఎనిమిది దశాబ్దాలపైగా పాలస్తీనాలో మారణహోమాన్ని సాగిస్తున్న అమానుష ఇజ్రాయెల్ వెనకా ఈ జాడ్యం తాలూకు ఛాయలే కనబడతాయి. అమెరికాలో కనబడే శ్వేతజాతి అహంకారం కూడా ఈ బాపతే. మనిషి అంతరాంతరాల్లో ఇలాంటివి గూడు కట్టుకున్నప్పుడు వారి వ్యవహార శైలిలో అది ప్రతిబింబించక మానదు. ఒక ప్రాంత భౌగోళిక వైశాల్యం ఎంతో చెప్పే పటాలు చూడటానికి అన్నిటికీ అతీతంగా, అలీనంగా కనబడతాయి. కానీ పటాల రూపకల్పనలో చోటుచేసుకునే రాజకీయాల గురించి 2020లో కార్నెల్ వర్సిటీ అధ్యాపకురాలు క్రిస్టిన్ లూయెన్‌బెర్గర్ చాలా సంగతులే చెప్పారు. దృగ్గోచరమయ్యే రాజకీయాలతో పాటు, ప్రచ్ఛన్నంగా, గుట్టుగా ఉండిపోయే రాజకీయాలు కూడా ఈ పటాల రూపకల్పనలో ఉంటాయని ఆమె అభిప్రాయం.

## నారా లోకేశ్ అడ్డంగా దొరికిపోయారు

**మొదటిపేజీ తరువాయి -** భారీ అవినీతి, అక్రమాలు చోటుచేసుకున్నాయని... విద్యాశాఖ మంత్రిగా ఉన్న నారా లోకేశ్ ఈ కుంభకోణంలో అడ్డంగా దొరికిపోయారని వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. డీఎస్సీ అక్రమాలపై ప్రభుత్వం మౌనం వహిస్తోందని... లోకేశ్ కు మంత్రి పదవిలో కొనసాగే అర్హత, హక్కు రెండూ లేవని మండిపడ్డారు. ఈ మొత్తం నియామక అక్రమాలపై తక్షణమే సీబీఐతో సమగ్ర విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. డీఎస్సీపై ప్రతిపక్షాలు, అభ్యర్థులు ఆధారాలతో సహా ప్రశ్నిస్తున్నా ముఖ్యమంత్రి చంద్రబాబు, లోకేశ్ ఏమీ మాట్లాడకుండా మత్తు ఇంజక్షన్లు తీసుకున్నట్లు మౌనం పాటిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ తప్పులను కప్పిపుచ్చుకోవడానికి ఐఏఎస్ అధికారులను ముందరకు నెట్టి మాట్లాడిస్తున్నారని ఆరోపించారు. "నారా లోకేశ్ ఉద్యోగాలను బఠానీలు అమ్మినట్లు మార్కెట్లో అమ్మేశారు. ఆయన దొరికిపోయిన దొంగ. రాజకీయాలకు, మంత్రి పదవికి ఎంతమాత్రం పనికిరారు" అని తీవ్ర పదజాలంతో విరుచుకుపడ్డారు. లోకేశ్ ను భవిష్యత్తులో ముఖ్యమంత్రిని చేయాలని చూస్తున్నారని, ఒకవేళ ఆయనకు ఆ పదవి ఇస్తే ఏకంగా రాష్ట్రంతో పాటు దేశాన్నే అమ్మేస్తారని ఎద్దేవా చేశారు. లోకేశ్ వైఖరి వల్లే టీడీపీ సర్వనాశనం కాబోతోందని వ్యాఖ్యానించారు. ఇప్పటికే జరిగిన డీఎస్సీలోనే వందలాది పోస్టులు అక్రమాలకు గురయ్యాయని, మళ్లీ మరో రెండు డీఎస్సీలు నిర్వహిస్తామని ప్రకటించడం నిరుద్యోగులను మోసం చేయడమేనని అన్నారు. నిరుద్యోగ యువత భవిష్యత్తుతో ఆడుకున్న లోకేశ్ తక్షణమే తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని అన్నారు.

## లాల్ మందిర్‌ను టార్గెట్ చేశారు.. ఎర్రకోట వద్ద పేల్చారు

**మొదటిపేజీ తరువాయి -** వెల్లడించింది. ఆ దాడిలో ఎర్రకోట అసలు లక్ష్యం కాదని, తీవ్రవాదులు మరొక ప్రదేశాన్ని టార్గెట్ చేశారని తన చార్జిషీట్‌లో పేర్కొంది. కేవలం ట్రాఫిక్ రద్దీ, కట్టుదిట్టమైన భద్రత కారణంగానే ఉగ్రవాదులు తమ ప్రణాళికను చివరి నిమిషంలో మార్చుకున్నారని తెలిపింది. 2025 నవంబర్ 10న జరిగిన ఈ ఘటనపై లోతైన దర్యాప్తు జరిపిన ఎన్ఐఏ, కీలక ఆధారాలను కోర్టుకు సమర్పించింది. దాని ప్రకారం, ఉగ్రవాదుల అసలు లక్ష్యం చాందినీ చౌక్‌లోని ప్రసిద్ధ లాల్ మందిర్ (జైన దేవాలయం). పేలుడు పదార్థాలతో నింపిన వాహనాన్ని మొదట అక్కడికే తీసుకెళ్లారు. సాయంత్రం 6:37 గంటల సమయంలో వాహనం డ్రైవర్ లాల్ మందిర్ సమీపంలో వాహనాన్ని నిలిపేందుకు ప్రయత్నించినట్లు సీసీటీవీ ఫుటేజీలో స్పష్టంగా రికార్డయింది. అయితే, ఆ సమయంలో ఆ ప్రాంతంలో విపరీతమైన రద్దీ ఉండటం, పోలీసుల భద్రత ఎక్కువగా ఉండటంతో వారి ప్లాన్ అమలు కాలేదు. అసలు లక్ష్యం వద్ద దాడి సాధ్యపడకపోవడంతో డ్రైవర్ వాహనాన్ని చారిత్రక ఎర్రకోట వైపు మళ్లించాడు. సుమారు 13 నిమిషాల తర్వాత సాయంత్రం 6:50 గంటలకు, ఎర్రకోటలోని గేట్ నంబర్ 4 సమీపంలో వాహనాన్ని పేల్చివేశాడు. ఈ భయానక ఆత్మాహుతి దాడిలో 11 మంది అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోగా, మరో 29 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఘటనా స్థలంలో లభించిన ఫోరెన్సిక్, డీఎన్ఏ ఆధారాలు ఈ కేసు దర్యాప్తులో కీలకంగా మారాయి. ఈ ఆధారాలను విశ్లేషించడం ద్వారా వాహనంలో ఉన్న ఆత్మాహుతి దళ సభ్యుడిని గుర్తించినట్లు ఎన్ఐఏ తన చార్జిషీట్‌లో పొందుపరిచింది. సీసీటీవీ ఫుటేజీ, శాస్త్రీయ ఆధారాలు ఈ ఉగ్రకుట్రను ఛేదించడంలో దర్యాప్తు సంస్థకు ఎంతగానో ఉపయోగపడ్డాయి. ఈ చార్జిషీట్ ప్రస్తుతం కొనసాగుతున్న విస్తృత దర్యాప్తులో ఒక భాగం మాత్రమేనని, దాడి వెనుక ఉన్న పెద్ద కుట్రను ఛేదించే పనిలో ఉన్నామని అధికారులు తెలిపారు. ఈ ఘటన అనంతరం ఢిల్లీతో పాటు దేశంలోని ఇతర ప్రధాన నగరాల్లో భద్రతను గణనీయంగా కట్టుదిట్టం చేశారు. కేవలం ట్రాఫిక్ కారణంగా ఒక ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెను ప్రమాదం నుంచి బయటపడటం గమనార్హం.

## కొందరు కాంగ్రెస్ నుంచి ఎదిగి కాంగ్రెస్‌కే నష్టం చేయాలని చూస్తున్నారు

**మొదటిపేజీ తరువాయి -** భవిష్యత్‌లో రాజకీయంగా రాణించలేరని, అందరికీ వెసులుబాటుగా ఉండాలని అత్యంత చారిత్రక భవనంలో శాసన మండలి నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. అసెంబ్లీలో సెంట్రల్ హాల్‌ను ప్రారంభించుకుని దుద్దిళ్ల శ్రీపాదరావు పేరు పెట్టామని గుర్తు చేశారు. సభలో నియోజకవర్గానికి సంబంధించిన సమస్యలు ప్రస్తావించాలని, కాంగ్రెస్ పార్టీ నుంచి ఎదిగి కాంగ్రెస్‌కు నష్టం చేకూర్చాలని కొందరు చూస్తున్నారని గుర్తు చేశారు. కాంగ్రెస్ అవకాశం ఇవ్వకపోతే సునీత లక్ష్మా రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి రాష్ట్రస్థాయి నాయకులుగా ఎదిగేవారా అని ప్రశ్నించారు. పోలీస్ సిబ్బందిలో కేటీఆర్‌కు రేవంత్ రెడ్డి కనిపించినట్టున్నారని ఎద్దేవా చేశారు. అంత ఆక్రోశంతో అధికారులపై దాడులు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశానికి మనం చేసిన జనగణన రోల్ మోడల్ అని, ఇది తెలంగాణ రాష్ట్రం సాధించిన ఘనత అని కొనియాడారు. తెలంగాణ నమూనాను జనగణనలో కులగణన చేపట్టాలని కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని ఆదేశించారు. ఎస్ఐఆర్ పేరుతో ఓట్లు తొలగించే కుట్ర జరుగుతోందని, ఎమ్మెల్యేగా గెలవాలనుకునే ప్రతీ ఒక్కరు ఈ ఓటు హక్కును కాపాడే అంశాన్ని సీరియస్‌గా తీసుకోవాలని సూచించారు. మీ ప్రతీ ప్రవర్తన రెండోసారి గెలుపుపై ప్రభావం చూపుతుందని, మీ వ్యక్తిగత పనితీరు మీ గెలుపు ఓటములను ప్రభావితం చేస్తుందని గుర్తు చేశారు.

## ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్లపై ప్రభుత్వం దృష్టి సారించింది

**మొదటిపేజీ తరువాయి -** రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం భారీ ప్రణాళికలు సిద్ధం చేస్తోందని, అందులో భాగంగా రిజర్వాయర్లపై 'ఫ్లోటింగ్ సోలార్ పవర్ ప్లాంట్ల' ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. శాసనసభ సమావేశాల్లో సోలార్ పవర్ ప్రాజెక్టులపై సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు ఆయన సుదీర్ఘ వివరణ ఇచ్చారు. నీటిపారుదల, విద్యుత్ శాఖలు సంయుక్తంగా నాగార్జునసాగర్, శ్రీశైలం సహా రాష్ట్రంలోని పలు ప్రధాన రిజర్వాయర్లను దీనికోసం సమగ్రంగా పరిశీలిస్తున్నాయని చెప్పారు. ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు అధిక వ్యయం కావడం ప్రధాన సవాల్‌గా మారిందన్నారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనలు/సుంకాల వల్ల ఒక్క మెగావాట్ ప్రాజెక్టుపై దాదాపు రూ. 1.30 కోట్ల మేర అదనపు భారం పడుతోందని, ఈ నిబంధనలను కేంద్రం సడలిస్తే రాష్ట్రానికి సోలార్ విభాగంలో పెట్టుబడులు భారీగా వెల్లువెత్తుతాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధి, వ్యవసాయం పెరగడంతో విద్యుత్ డిమాండ్ ఏకంగా 19,000 మెగావాట్లకు చేరిందని తెలిపారు. పేదలు, రైతుల విద్యుత్ సబ్సిడీల కోసం ప్రభుత్వం ఏటా రూ. 19,000 కోట్లకు పైగా ఖర్చు చేస్తోందని వివరించారు. గిరిజన ప్రాంతాల్లో ఉచిత సోలార్ విద్యుత్‌ను ప్రోత్సహించేందుకు 'ఇందిరా సౌర గిరి జల వికాసం' పథకాన్ని అమలు చేస్తున్నట్లు భట్టి ప్రకటించారు. అమ్రాబాద్ పరిధిలోని 80 గ్రామాలను పూర్తిస్థాయిలో సోలరైజ్ చేసేందుకు పైలట్ ప్రాజెక్ట్ చేపట్టామని, అక్కడ స్వతంత్ర 'మైక్రో గ్రిడ్లు' నిర్మించేందుకు కసరత్తు జరుగుతోందన్నారు. సాధారణ రైతులు, ప్రజలు తమ ఇళ్లు, పొలాల్లో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు.

## ఇగోలు పక్కనపెట్టి ప్రజాసేవకులుగా పని చేద్దాం

**మొదటిపేజీ తరువాయి -** ఉత్తమ విధానాలపై సమగ్రంగా చర్చించారు. రాష్ట్ర అభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా జిల్లాల పనితీరును మరింత మెరుగుపరిచే అంశాలపై సదస్సులో దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, రాష్ట్రానికి ఉన్న అన్ని అవకాశాలను అన్‌లాక్ చేస్తూ ప్రతి శాఖలో సంస్కరణలు తీసుకొచ్చామని, ఆర్థిక ప్రగతిని ప్రతి నెలా పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. 2022-23ను బేస్ ఇయర్‌గా తీసుకుంటే ప్రస్తుత ధరల ప్రకారం 13.44 శాతం వృద్ధి నమోదైందని, జీఎస్టీ వసూళ్లు గతేడాదితో పోలిస్తే రూ.25,450 కోట్లు పెరిగాయని వెల్లడించారు. వనరులు, టెక్నాలజీ ఉన్నా కొన్ని చోట్ల లోపం ఉందన్న సీఎం, రియాక్టివ్ గవర్నెన్స్‌కు స్వస్తి చెప్పి ప్రోయాక్టివ్ గవర్నెన్స్ అందించాలని అధికారులను ఆదేశించారు. ఇగోలు పక్కనపెట్టి ప్రజా సేవకులుగా పని చేద్దామంటూ అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. 27 నెలల్లో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టి, సంక్షేమానికి రూ.1.40 లక్షల కోట్లు, అభివృద్ధికి రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. హంద్రీనీవా, వెలిగొండ ఫేజ్-1, పోలవరం ఎడమ కాలువ, భోగాపురం విమానాశ్రయం వంటి కీలక ప్రాజెక్టులు పూర్తి చేశామని, పోలవరాన్ని 2027 మార్చి నాటికి పూర్తి చేస్తామని వెల్లడించారు. నీటి భద్రత, సాగునీటి రంగంలో చేస్తున్న కృషికి 'వాటర్‌మ్యాన్'గా గుర్తింపు రావడం సంతోషంగా ఉందన్న సీఎం, రాష్ట్ర ప్రగతి వెనుక మంత్రులు, అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతి నిధుల సమష్టి కృషి ఉందని స్పష్టం చేశారు. ఫేక్ ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టించే రాజకీయ కుట్రలకు అధికారులు వేగంగా కౌంటర్ ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. డీఎస్సీ నియామకాల్లో ఎలాంటి తప్పు జరగలేదని, స్పోర్ట్స్ కోటాలో నిబంధనల ప్రకారమే ఉద్యోగాలు ఇచ్చామని తేల్చిచెప్పారు. దుష్ప్రచారాన్ని తిప్పికొట్టిన ఇద్దరు మహిళా అధికారులను అభినందించిన సీఎం, సరైన సమయంలో స్పందించకపోతే ఆ నష్టం ప్రభుత్వానికే చుట్టుకుంటుందని హెచ్చరిం చారు. సమీక్షలకే పరిమితం కాకుండా ఫలితాలపై దృష్టి పెట్టాలని, ప్రతి జిల్లాలో 25 టాప్ ప్రాజెక్టులు, ప్రతి నియోజక వర్గంలో 10--15 ప్రాధాన్య ప్రాజెక్టులను గుర్తించి అభివృద్ధి చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. తాగునీటి సరఫరాలో ఎలాంటి రాజీ ఉండదని, సంక్షోభ సమయంలో కలెక్టర్ల నాయకత్వ సామర్థ్యం బయటపడాలని స్పష్టం చేశారు. 2027 నాటికి భూ వివాదాలు లేని రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దాలని, జిల్లాలను గ్రోత్ ఇంజిన్లుగా మార్చి ఆదాయం, సంపద పెంచేలా పని చేయాలని దిశానిర్దేశం చేశారు. ప్రస్తుతం 13.44 శాతంగా ఉన్న వృద్ధిని 15 శాతానికి తీసుకెళ్లే లక్ష్యంతో బెస్ట్ ప్రాక్టీసెస్, కొత్త ఆలోచనలు, వేగవంతమైన పాలనతో ముందుకె ళ్లాలని సూచించారు. రివ్యూల నుంచి రిజల్ట్స్ వైపు మారి, వన్ స్టేట్-వన్ మిషన్-వన్ ఎయిమ్ అనేదే స్వర్ణాంధ్రప్రదేశ్ లక్ష్యమని చంద్రబాబు తేల్చి చెప్పారు.

## రివ్యూలు కాదు.. రిజల్ట్స్ కావాలి

**మొదటిపేజీ తరువాయి -** ప్రారంభమైన 8వ జిల్లా కలెక్టర్ల సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. రెండు రోజుల పాటు మొత్తం 12 గంటల పాటు సాగే ఈ కీలక సదస్సులో తొలిరోజు, పాలనలో తీసుకురావాల్సిన మార్పులు, అభివృద్ధి లక్ష్యాలపై ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రజా సేవకులుగా అహంభావాలకు తావివ్వకుండా పనిచేయాలని సూచించిన ముఖ్యమంత్రి, నాయకత్వ లక్షణాలు ప్రదర్శించాలంటే ముందుగా యాజమాన్య బాధ్యత (ఓనర్‌షిప్) తీసుకోవడం అలవర్చుకోవాలని హితవు పలికారు. "ఫైల్ పెండింగ్‌లో ఉందంటే అభివృద్ధి పెండింగ్‌లో ఉన్నట్టే. ఫిర్యాదు పెండింగ్‌లో ఉందంటే ప్రజలకు న్యాయం ఆలస్యమవుతున్నట్టే. ప్రభుత్వాన్ని మభ్యపెట్టే నివేదికలు వద్దు, వాస్తవాలు నిర్భయంగా చెప్పండి. సమస్యను దాచిపెడితే అది పెద్దదవుతుంది, కానీ దానిపై బహిరంగంగా చర్చిస్తే పరిష్కారం లభిస్తుంది. సాధారణ పరిపాలన కాదు, ప్రజలు మెచ్చే సుపరిపాలన అందించాలి. ఇందుకోసం శాఖలు, జిల్లాలు, సెక్రటరీలు, కలెక్టర్లు ఒకరితో ఒకరు ఆరోగ్యకరంగా పోటీపడాలి. 'వన్ స్టేట్-వన్ విజన్-వన్ టీమ్-వన్ మిషన్'... ఇదే మనందరినీ స్వర్ణాంధ్ర లక్ష్యం వైపు నడిపిస్తుంది" అని చంద్రబాబు ఉద్ఘాటించారు. ఈ సందర్భంగా, సాగునీటి రంగంలో ప్రభుత్వం సాధించిన ప్రగతిపై ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ, ఎకనమిక్ టైమ్స్ పత్రిక ముఖ్యమంత్రిని 'సీఈఓ టు వాటర్‌మ్యాన్' అంటూ ప్రచురించిన కథనాన్ని ప్రస్తావించారు. దీనికి స్పందించిన సీఎం చంద్రబాబు, ఆ గుర్తింపు తనకు ఎంతో ఆనందాన్నిచ్చిందని అన్నారు. "గతంలో గ్లోబల్ డ్రీమ్ కేబినెట్‌లో నా పేరు వచ్చినప్పుడు గానీ, నన్ను సీఈఓ సీఎం అన్నప్పుడు గానీ నేను ఇంతలా సంతోషించలేదు. రాష్ట్రంలోని కరవు ప్రాంతాలకు, భౌగోళిక అసమానతల కారణంగా నీటి ఎద్దడి ఎదుర్కొంటున్న ప్రాంతాలకు నీటిని అందించగలిగినప్పుడే నాకు నిజమైన సంతృప్తి. ఆ నీటి భద్రత, సంరక్షణ చర్యలను గుర్తించి 'వాటర్ మ్యాన్' అని పేరు పెట్టినందుకు సంతోషంగా ఉంది" అని ఆయన భావోద్వేగంగా అన్నారు. ఈ వ్యాఖ్యల అనంతరం సాగునీటి రంగంలో ముఖ్యమంత్రి కృషికి అభినందనగా సమావేశంలో ఉన్న కలెక్టర్లు, అధికారులు, మంత్రులు లేచి నిలబడి చప్పట్లతో (స్టాండింగ్ ఓవేషన్) గౌరవం తెలిపారు. గడిచిన 27 నెలల్లో రాష్ట్ర పునర్నిర్మాణంలో భాగంగా ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టామని, రూ.1.40 లక్షల కోట్లు సంక్షేమానికి, రూ.1.50 లక్షల కోట్లు అభివృద్ధికి ఖర్చు చేశామని సీఎం వివరించారు. "హంద్రీనీవా, వెలిగొండ ఫేజ్-1, పోలవరం ఎడమ కాలువ ద్వారా నీళ్లిచ్చాం. పోలవరం ప్రాజెక్టును మార్చి 2027 నాటికి పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం. ఈ విజయాలన్నీ ఏ ఒక్కరి వల్లో సాధ్యం కాలేదు. ప్రధాని మోదీ, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సహకారంతో పాటు మంత్రులు, అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు అందరూ ఒక జట్టుగా పనిచేయడం వల్లే ఇది సాధ్యమైంది. ఇది టీమ్ సక్సెస్" అని చంద్రబాబు పేర్కొన్నారు. ప్రతి జిల్లాలో 25 ప్రధాన ప్రాజెక్టులను, ప్రతి నియోజకవర్గంలో 10-15 ప్రాధాన్యతాంశాలను గుర్తించి వాటిని పూర్తి చేయాలని కలెక్టర్లకు ఆదేశించారు. జిల్లాలో 'గ్రోత్ ఇంజన్లను' గుర్తించి సంపద సృష్టించాలని సూచించారు. "టెక్నాలజీని అందిపుచ్చుకుని 'డీప్ టెక్ గవర్నెన్స్' ద్వారా నిర్ణయాల్లో వేగం, సేవల్లో నాణ్యత పెంచాలి. కొందరు పనిగట్టుకుని ఫేక్ ప్రచారాలు చేస్తున్నారు. వాటిని వెంటనే గుర్తించి, వాస్తవాలతో తిప్పికొట్టాలి. డీఎస్సీ-2025 విషయంలో ఇద్దరు మహిళా అధికారులు సమర్థంగా స్పందించి వాస్తవాలను ప్రజల ముందుంచారు. వారిని అభినందిస్తున్నాను" అని సీఎం అన్నారు. గత ప్రభుత్వ హయాంలోని 'జే బ్రాండ్' మద్యం వల్ల ప్రజల ఆరోగ్యం దెబ్బతిన్నదని, తాము కల్తీ బ్రాండ్లను రద్దు చేసి పారదర్శకత తీసుకొచ్చామని తెలిపారు. ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో 54 శాతం లోటు వర్షపాతం నమోదైందని, నీటి భద్రత ఒక సవాలుగా మారిందని, అయినా తాగునీటి సరఫరాలో ఎలాంటి రాజీ పడబోమని హామీ ఇచ్చారు. సంక్షోభ సమయాల్లోనే కలెక్టర్ల నాయకత్వ పటిమ బయటపడాలని ఆయన పిలుపునిచ్చారు. 2027 నాటికి భూ వివాదాలు లేని రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దడమే లక్ష్యమని, ప్రస్తుతం 13.44 శాతంగా ఉన్న రాష్ట్ర వృద్ధిరేటును 15 శాతానికి తీసుకెళ్దామని ఆయన అధికారులలో స్ఫూర్తి నింపారు. ఈ సమావేశంలో మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## అంతరిక్షం అందరిదీ బాధ్యత కూడా సమష్టిగా ఉండాలి

**మొదటిపేజీ తరువాయి -** ఫ్రాన్స్‌తో పాటు ఇతర దేశాలు భాగస్వాములు కావాలని మోదీ ఆహ్వానించారు. 'శతాబ్దాలుగా అంతరిక్షం మానవ ఊహాశక్తికి స్ఫూర్తినిచ్చింది. ఇప్పుడు అంతరిక్ష సాంకేతికత భూమిపై జీవన విధానాన్ని ప్రభావితం చేస్తోంది. వాతావరణ పరిస్థితుల అంచనా నుంచి పంటలు, సముద్రాలు, ప్రజల జీవనానికి సంబంధించిన అనేక అంశాల్లో అంతరిక్ష విజ్ఞానం కీలకంగా మారింది. అంతరిక్ష రంగంలో అవకాశాలు అపారమని, అదే సమయంలో బాధ్యత కూడా అందరిదే. కక్ష్యల్లో ఉపగ్రహాల సంఖ్య పెరుగుతున్న వేళ, సాంకేతికత మరింత శక్తిమంతంగా మారుతున్న సమయంలో సరైన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. భారత్ అంతరిక్ష విధానం 'వసుధైవ కుటుంబకం' అనే భావనపై ఆధారపడి ఉంది. 'వన్ ఎర్త్, వన్ ఫ్యామిలీ, వన్ ఫ్యూచర్' అనే స్ఫూర్తి ఇక భూగ్రహాన్ని దాటి అంతరిక్షానికి కూడా విస్తరించాలి. అంతరిక్షంలో లభించే శాస్త్రీయ సమాచారాన్ని పారదర్శకత, సమగ్రతతో మానవాళి ఉమ్మడి ప్రయోజనాలకు వినియోగించాలి' అని ప్రధాని మోదీ సూచించారు. భారత్ అంతరిక్ష ప్రయాణానికి భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) కేంద్రబిందువుగా ఉందని ప్రధాని తెలిపారు. అత్యుత్తమ సాంకేతిక సామర్థ్యంతో పాటు తక్కువ వ్యయంతో విజయవంతమైన మిషన్లను నిర్వహిస్తూ ఇస్రో ప్రపంచ ప్రశంసలు అందుకుందని పేర్కొన్నారు. ఇస్రో సాంకేతికతలు కేవలం అంతరిక్ష పరిశోధనలకే పరిమితం కాలేదని అన్నారు. రైతులకు వ్యవసాయ సమాచారం, మత్స్యకారులకు సముద్ర సంబంధిత సమాచారం, వాతావరణ అంచనాలు, విపత్తు నిర్వహణ, నావిగేషన్ వంటి అనేక రంగాలకు అవి ఉపయోగపడుతున్నాయని వివరించారు. భారత రాకెట్ల ద్వారా ఇప్పటివరకు 34 దేశాలకు చెందిన 430కుపైగా ఉపగ్రహాలు అంతరిక్షంలోకి వెళ్లాయని ప్రధాని తెలిపారు. ఇస్రో సాంకేతికతలు, అంతర్జాతీయ భాగస్వామ్యాలు భారత్‌కే కాకుండా ప్రపంచ దేశాలకు కూడా ప్రయోజనం చేకూరుస్తున్నాయని చెప్పారు. 2035 నాటికి భారతీయ అంతరిక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని భారత్ లక్ష్యంగా పెట్టుకుందని ప్రధాని మోదీ తెలిపారు. 2040 నాటికి భారతీయుడిని చంద్రుడిపైకి పంపాలని ప్రణాళిక రూపొందించుకున్నట్లు వెల్లడించారు. అంతరిక్ష రంగంలో భారత్ సాధించే పురోగతి ప్రయోజనాలు మానవాళి మొత్తానికి చేరాలన్నదే తమ మార్గదర్శక సూత్రమని ప్రధాని స్పష్టం చేశారు. భారత్ అంతరిక్ష విజయాలను ప్రస్తావించారు ప్రధాని మోదీ. చంద్రయాన్-3 మిషన్? ద్వారా చంద్రుడి దక్షిణ ధ్రువానికి సమీప ప్రాంతంలో సాఫ్ట్ ల్యాండింగ్ చేసిన తొలి దేశంగా భారత్? నిలిచిందని తెలిపారు. సూర్యుడిపై అధ్యయనం కోసం చేపట్టిన ఆదిత్య-ఎల్1 మిషన్ సూర్యుడి రహస్యాలను ఛేదించే దిశగా కీలక సమాచారాన్ని అందిస్తోందని పేర్కొన్నారు. గతేడాది ఓ భారతీయ వ్యోమగామి అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రాన్ని సందర్శించారని గుర్తుచేశారు.

## భారత్ అమ్ములపొదిలో 190 అణు వార్‌హెడ్లు

**మొదటిపేజీ తరువాయి -** సిద్ధంగా ఉండగా మరో 30 కొత్త క్షిపణుల కోసం ఉత్పత్తి దశలో ఉన్నాయని తెలిపారు. వాణిజ్య ఉపగ్రహ చిత్రాలు, పబ్లిక్ డేటా విశ్లేషణల ఆధారంగా ఈ అంచనాకు వచ్చినట్లు హాన్స్ క్రిస్టెన్సెన్ తెలిపారు. గాలి, నేల, సముద్రం ద్వారా ప్రయోగించగల అణువ్యవస్థలను భారత్ వేగంగా అభివృద్ధి చేస్తోందని హాన్స్ క్రిస్టెన్సెన్ పేర్కొన్నారు. 2026 ప్రారంభం నాటికి భారత్ వద్ద సుమారు 730 కిలోల వెపన్- గ్రేడ్ ప్లుటోనియం ఉన్నట్లు అంచనా వేశారు. ఒక్కో వార్‌హెడ్‌కు 4 కిలోల ప్లుటోనియం అవసరం అనుకున్నా ఈ నిల్వలు 140 నుంచి 225 వార్‌హెడ్ల తయారీకి సరిపోతాయని తెలిపారు. అయితే భారత్ తన వద్ద ఉన్న ప్లుటోనియం మొత్తాన్ని ఆయుధాల తయారీకే వాడకపోవచ్చని, కొంత రిజర్వ్‌గా ఉంచుకునే అవకాశం ఉందని హాన్స్ క్రిస్టెన్సెన్ కథనం పేర్కొంది. ఆయుధ సంపత్తిని పెంచుకున్నప్పటికీ భారత్ తన విధానాలకు కట్టుబడి ఉంది. 1998లో పోఖ్రాన్-×× అణుపరీక్షల తర్వాత భారత్ 'నో ఫస్ట్ యూజ్' సిద్ధాంతాన్ని ప్రకటించింది. తమ అణ్వాయుధాలు కేవలం శత్రు దేశాలను నిలువరించటానికి మాత్రమేనని పార్లమెంటులోనూ ప్రభుత్వం స్పష్టం చేసింది. కాగా, మరిన్ని కొత్త క్షిపణి వ్యవస్థలు అభివృద్ధి దశలో ఉన్నందున, రానున్న రోజుల్లో భారత్ అణ్వాయుధాల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా, ప్రపంచవ్యాప్తంగా భౌగోళిక రాజకీయ అనిశ్చితులు, యుద్ధాల నేపథ్యంలో ఇటీవలి కాలంలో అనేక దేశాలు తమ సైనిక సామర్థ్యాలను బలోపేతం చేసుకునే దిశగా అడుగులు వేస్తున్నాయి. ముఖ్యంగా అణుశక్తి కలిగిన దేశాలు తమ ఆయుధ సంపత్తిని మరింత మెరుగుపరుచుకుంటున్నాయి. అయితే, ప్రపంచంలో అత్యధిక అణ్వాయుధాలున్న దేశాలుగా అమెరికా, రష్యా ముందు వరుసలో ఉన్నాయి. ఈ మేరకు స్టాక్‌హోమ్ అంతర్జాతీయ శాంతి పరిశోధన సంస్థ (సిప్రి) కొద్దిరోజుల క్రితం ఒక నివేదికలో వెల్లడించింది. రష్యా వద్ద 5,420, అమెరికా వద్ద 5,042 అణు వార్‌హెడ్లు ఉన్నాయని పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా అణుశక్తి దేశాలు కలిగిన దేశాలు తొమ్మిది కాగా, వాటి వద్ద మొత్తంగా 12వేలకు పైగా అణ్వాయుధాలు ఉన్నట్లు వెల్లడించింది. ఈ జాబితాలో యూకే (225), ఫ్రాన్స్ (370), ఉత్తరకొరియా (60), ఇజ్రాయెల్ (90), దేశాలున్నాయి. ఇక భారత్? విషయానికొస్తే, అణ్వాయుధాల విషయంలో మన దేశం కూడా వేగంగా అడుగులు వేస్తోంది. ఈ ఏడాది జనవరి నాటికి భారత్ వద్ద 190 అణ్వాయుధాలు ఉన్నాయని, అది పాక్? కంటే ఎక్కువేనని సిప్రి నివేదించింది. ఏడాది వ్యవధిలో భారత్ 10 వార్‌హెడ్లను పెంచుకుందని నివేదికలో పేర్కొంది. అలాగే, చైనా వద్ద 620 అణ్వాయుధాలు ఉన్నాయని పేర్కొంది. గతేడాదితో పోలిస్తే బీజింగ్ 20 అణు వార్‌హెడ్‌లను తన ఆయుధాగారంలోకి చేర్చుకుందని తెలిపింది. ఇక, ప్రపంచంలోనే అత్యధిక రక్షణ వ్యయం ఉన్న దేశాల జాబితాలో భారత్ ఐదో స్థానంలో ఉంది. 2025లో భారత రక్షణ వ్యయం 92.1 బిలియన్ డాలర్లుగా ఉన్నట్లు సిప్రి నివేదిక వెల్లడించింది. అంతక్రితం ఏడాదితో పోలిస్తే ఇది 8.9శాతం ఎక్కువ అని తెలుస్తోంది. ఇక, 2021-25 మధ్య ప్రపంచవ్యాప్తంగా రక్షణ దిగుమతుల్లో 8.2శాతం మన దేశానివే కావడం విశేషం.

## మనం సృష్టించిన మేధస్సు మనల్నే మింగేస్తే

**మొదటిపేజీ తరువాయి -** ఒకప్పుడు మనిషి యంత్రాలకు ఆలోచించడం నేర్పించాలని కలలు కన్నాడు. ఇప్పుడు ఆ యంత్రాలే మనిషిని మించి ఆలోచిస్తే? అదే జరిగితే పరిస్థితి ఎలా ఉంటుంది? మనిషి ఆపలేని స్థాయికి కృత్రిమ మేధస్సు చేరితే ఏం జరుగుతుంది? ఇది ఇక సైన్స్ ఫిక్షన్ కథల్లో మాత్రమే కనిపించే ప్రశ్న కాదు. ప్రపంచంలోని ప్రముఖ ఏఐ నిపుణులు, టెక్ దిగ్గజాలు ఇదే విషయంపై తీవ్రంగా హెచ్చరిస్తున్నారు. తాజాగా జాకబ్ కాక్సన్ చేసిన వ్యాఖ్యలు ఈ చర్చను మరోసారి ముందుకు తెచ్చాయి. ఆంత్రోపిక్ నుంచి తప్పుకొన్న ఆయన గతంలో ఓపెన్‌ఏఐలోనూ పనిచేశారు. ఏఐ సంస్థలు బాధ్యతాయుతంగా వ్యవహరించడం లేదన్న ఆందోళనతో బయటకు వచ్చినట్లు చెప్పారు. "మన జీవితాలతో జూదమాడ ుతున్నారు" అంటూ ఏఐ సంస్థలపై తీవ్ర ఆరోపణలు చేశారు. అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఏఐ.. మనుష లందరినీ చంపగల ఆర్టిఫిషియల్ సూపర్ ఇంటెలిజెన్స్‌గా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అది వచ్చే పదేళ్లలోనే జరగొచ్చని ఆయన అంచనా వేశారు. ఇది కాక్సన్ ఒక్కడి అభిప్రాయం కాదు. టెస్లా అధినేత ఎలాన్ మస్క్ చాలాకాలంగా ఇదే ప్రమాదాన్ని ప్రస్తావిస్తు న్నారు. మనుషుల కంటే ఎన్నో రెట్లు తెలివైన ఏఐను నియంత్రిం చడం కష్టమవుతుందని హెచ్చరిస్తున్నారు. విద్యుత్ గ్రిడ్లను హ్యాక్ చేయడం, నీటి సరఫరాలను నిలిపివేయడం, ప్రమాదకర జీవ ఆయుధాల రూపకల్పనకు ఏఐను ఉపయోగించడం వంటి ముప్పుల్ని ఆయన ప్రస్తావించారు. అయితే ఈ హెచ్చరికలు సాధారణ ఏఐ గురించి కాదు. మనిషి చేసే దాదాపు అన్ని మేధో పనులను చేయగల ఆర్టిఫిషియల్ జనరల్ ఇంటెలిజెన్స్ (ఏజీఐ) గురించి. ఈ విషయం మస్క్‌కు ప్రత్యేకంగా కీలకం. ఎందుకంటే ఆయన ఏఐ రంగంలో పెట్టుబడులు పెట్టడంతో పాటు ఆటోమేటిక్ కార్ల సాంకేతికతలోనూ ముందున్నారు. ఏఐ రంగంలో 'గాడ్‌ఫాదర్'గా పేరున్న జెఫ్రీ హింటన్ కూడా గూగుల్ నుంచి తప్పుకొన్న తర్వాత ఇదే ప్రమాదాలపై బహిరంగంగా మాట్లాడు తున్నారు. ఏజీఐ మనుష లను మేధస్సులో అధిగమించవచ్చని ఆయన హెచ్చరిస్తు న్నారు. తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయడం, మనుషులను ప్రభావితం చేయడం, అధికారాన్ని సంపాదించాలనే ప్రమాదకర లక్ష్యాలను స్వయంగా ఏర్పరచుకోవడం వంటి పరిణామాలు సంభవించవచ్చని చెబుతున్నారు. ట్యూరింగ్ అవార్డు గ్రహీత యోషువా బెంగియో సైతం అత్యాధునిక ఏఐ అభివృద్ధిపై కఠిన నిబంధనలు కోరుతున్నారు. భద్రతకు సంబంధించిన ప్రమాణాలు నిరూపితమయ్యే వరకు శక్తిమంతమైన ఏఐ మోడళ్ల శిక్షణను నియంత్రించాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు. గూగుల్ డీప్‌మైండ్ సీఈఓ డెమిస్ హసాబిస్, ఓపెన్‌ఏఐ చీఫ్ సైంటిస్ట్ పాకోచ్కీ, సామ్ ఆల్ట్‌మన్, ఆంత్రోపిక్ సీఈఓ డారియో అమోడెయ్ కూడా ఏఐ వల్ల మానవాళి అంతరించిపోయే ప్రమాదాన్ని తగ్గించాల్సిన అవసరాన్ని అంగీకరించారు. ఇది ప్రపంచ స్థాయి ప్రాధాన్య అంశమని పేర్కొన్నారు. ఏఐ మనిషి సృష్టించిన అద్భుతమైన సాంకేతికత. కానీ అదే సాంకేతికత మనిషిని మించి వెళ్లిన రోజు ఏం జరుగుతుందన్న ప్రశ్నకు మాత్రం ఇప్పటికీ స్పష్టమైన సమాధానం లేదు. బహుశా అసలు పోటీ ఏఐతో కాదు.. మనిషి తన సృష్టిని ఎంతవరకు నియంత్రించగలడన్నదే.

## దుష్ప్రచారాలు నమ్మొద్దు

**మొదటిపేజీ తరువాయి -** హైదరాబాద్ మహానగరంలో వినాయక నిమజ్జనం ఏర్పాట్లపై సోషల్ మీడియాలో వస్తున్న ఊహాగానాలు, వ్యతిరేక ప్రచారాలపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పందించారు. చెరువుల్లో గణేశ్ విగ్రహాల నిమజ్జనానికి హైడ్రా ఎప్పుడూ వ్యతిరేకం కాదని, తాము పునరుద్ధరణ పనులు చేపడుతున్న చెరువుల వద్ద నిమజ్జనాలకు ఎలాంటి ఆంక్షలు విధించలేదని ఆయన ఫుల్ క్లారిటీ ఇచ్చారు. అసత్య ప్రచారాలను ప్రజలు, ఉత్సవ నిర్వాహకులు నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నోటిఫై చేసిన నాలుగైదు సున్నితమైన చెరువుల వద్ద మాత్రమే ఆంక్షలు అమలులో ఉన్నాయని తెలిపారు. దేశంలోనే ప్రప్రథమంగా బయో డైవర్సిటీగా గుర్తించిన అమీన్‌పూర్ చెరువు, నేచురల్ వెట్‌ల్యాండ్‌గా రక్షణ పొందిన కాప్రా చెరువులు ఇందులో ఉన్నాయని గుర్తుచేశారు. కాప్రా చెరువులో ప్రస్తుతం నీరు లేనందున అక్కడ ఎవరూ సమస్యలు సృష్టించవద్దని కోరారు. నగరంలోని మిగిలిన అన్ని చెరువులు, జలాశయాల్లో వినాయక నిమజ్జనాలు ఎప్పటిలాగే యథావిధిగా సాగుతాయని స్పష్టం చేశారు. ప్రధాన నీటి వనరులు, చెరువుల పర్యావరణం దెబ్బతినకుండా ఉండేందుకు, భక్తులు, ఉత్సవ కమిటీలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా ఉండేందుకు విస్తృతంగా 'బేబీ పాండ్స్' ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. హైడ్రా సుందరీకరిస్తున్న చెరువుల వద్ద ఎటువంటి నిషేధాలు లేవని, వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా, పర్యావరణ హితంగా నిర్వహించుకునేలా భాగ్యనగర ప్రజలు, ఉత్సవ సమితి ప్రతినిధులు సహకరించాలని కోరారు.



ప్రజా మంటలు
శుక్రవారం 11 - 09 - 2026

# ఐదు నెలలుగా జీతాలు లేక ఆర్థిక ఇబ్బందులు

**కంప్యూటర్ ఆపరేటర్ల సామూహిక సెలవు**

**ఎంపీడీవో రవీందర్ రావుకు వినతి పత్రం**



**గొల్లపల్లి సెప్టెంబర్ 10 ప్రజా మంటలు :** జగిత్యాల జిల్లాలోని అన్ని మండలాలకు చెందిన పంచాయతీ రాజ్ శాఖ ఈ -పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు ఐదు నెలలుగా జీతాలు అందక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నెలల తరబడి జీతాలు రాకపోవడంతో విధులకు హాజరయ్యేందుకు అవసరమైన ప్రయాణ ఖర్చులు కూడా భరించలేని పరిస్థితి ఏర్పడిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తు ఈ నేపథ్యంలో గురువారం గొల్లపల్లి మండల కంప్యూటర్ ఆపరేటర్లు సామూహిక సెలవులు పెట్టి తమ నిరసనను తెలియజేశారు.గొల్లపల్లి మండల కార్యాలయాల్లో ఎంపీడీఓ కు సామూహిక సెలవు పత్రాలను సమర్పించారు.ఐదు నెలలుగా జీతాలు లేక కుటుంబాలను పోషించుకోవడం, రోజువారీ ఖర్చులు నిర్వహించడం, విధులకు రాకపోకలు సాగించడం కూడా కష్టంగా మారిందని కంప్యూటర్ ఆపరేటర్లు తెలిపారు. ఎన్నిసార్లు తమ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్యకు శాశ్వత పరిష్కారం లభించకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో సామూహిక సెలవుల నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు.ప్రభుత్వ పథకాలు, పంచాయతీ పరిపాలనకు సంబంధించిన అనేక కీలకమైన ఆన్‌లైన్ పనులు, ప్రజలకు అందించే సేవల్లో కంప్యూటర్ ఆపరేటర్లు కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, తమ జీతాల విషయంలో మాత్రం ఎందుకు ఇంత నిర్లక్ష్యం జరుగుతోందని అరుణ్, రాజు, నరిన్, అన్నారు

# సేవా దృక్పథంతోనే ఉత్తమ సమాజ నిర్మాణం

**బేగంపేట మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఓరియంటేషన్**



**సికింద్రాబాద్, సెప్టెంబర్ 10 (ప్రజా మంటలు):** సమాజ సేవ ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత అలవడతాయని బేగంపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి) ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. పద్మావతి పేర్కొన్నారు. కళాశాల కాన్ఫరెన్స్ హాల్‌లో 2026--27 విద్యా సంవత్సరానికి ఎంపికైన నూతన ఎన్ఎస్ఎస్ (చీూ) వాలంటీర్లకు బుధవారం ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. యూనిట్- ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ డి. సరిత ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో ఎన్ఎస్ఎస్ ముఖ్య లక్ష్యాలు, నిర్వహించే సేవా కార్యక్రమాలు, సమాజం పట్ల విద్యార్థుల పాత్రపై సమగ్ర అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. పద్మావతి మాట్లాడుతూ, విద్యార్థి దశ నుంచే సేవా భావాన్ని అలవర్చుకోవాలని, ప్రతి వాలంటీర్ సమాజ హితం కోసం పాటుపడుతూ ఆపన్నులకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సరిత మాట్లాడుతూ. విద్యార్థులు బాధ్యతాయుత పౌరులుగా ఎదగడానికి ఎన్ఎస్ఎస్ ఎంతో దోహదపడుతుందని తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య వక్తగా హాజరైన స్టేట్ ఎన్ఎస్ఎస్ అవార్డు గ్రహీత, రాజ్‌మాతా ఫౌండేషన్ ప్రతినిధి ఉదయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, ఎన్ఎస్ఎస్ అనేది కేవలం ఒక వేదిక మాత్రమే కాదని, అది క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, మానవతా విలువలను నేర్పే గొప్ప పాఠశాల అని తన అనుభవాలను పంచుకుంటూ విద్యార్థుల్లో స్ఫూర్తి నింపారు.'నేను కాదు -- నువ్వు' (నాట్ మీ బట్ యూ) అనే నినాదంతో ప్రతి ఒక్కరూ సేవా పథంలో ముందుకు సాగాలని వక్తలు సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ మృదుల, డాక్టర్ ప్రసన్న, నరసింహులు, వెంకటేశ్వర్లు, మధుకర్ రావు, డాక్టర్ రామాచారితో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థినులు పాల్గొన్నారు.

# నిరంకుశ పాలనపై ఎదిరించిన ధీరవనిత ఐలమ్మ

**ఎంపీ లక్ష్మణ్**



**సికింద్రాబాద్, సెప్టెంబర్ 10 (ప్రజా మంటలు):** నిజాం నిరంకుశ పాలనకు, భూస్వాముల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా కొడవలి పట్టి గర్జించిన తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు వీరనారి చాకలి ఐలమ్మ (చిట్యాల ఐలమ్మ) అని ఎంపీ డాక్టర్ కే. లక్ష్మణ్ కొనియాడారు. భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో మహంకాళి--సికింద్రాబాద్ జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు వై. సురేష్ కుమార్ అధ్యక్షతన గురువారం నిర్వహించిన ఐలమ్మ వర్ధంతి కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. భూమి, భుక్తి, వెట్టిచాకిరి విముక్తి కోసం సాగిన పోరాటంలో ఆమె అణగారిన వర్గాలకు ధైర్యాన్ని నింపారని, విస్నూరు దేశ్‌ముఖ్ దౌర్జన్యాలను ఎదిరించి కౌలు భూమి హక్కుల కోసం హైకోర్టు వరకు పోరాడిన వీరవనిత అని గుర్తుచేశారు.అనంతరం బీజేపీ నగర అధ్యక్షుడు గుండగోని భరత్ గౌడ్ మాట్లాడుతూ.. నాటి కమ్యూనిస్టులు, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు సాయుధ పోరాట యోధులను విస్మరించినా, అమరవీరుల కుటుంబాలకు అండగా నిలబడి ఉద్యమకారులను నిరంతరం గౌరవించే ఏకైక పార్టీ బీజేపీ మాత్రమేనని స్పష్టం చేశారు. అనంతరం నేతలు ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ పార్లమెంట్ కన్వీనర్ టి. రాజశేఖర్ రెడ్డి, నగర ప్రధాన కార్యదర్శులు మేకల సారంగపాణి, రమేష్ రామ్, ఓబీసీ మోర్చా నాయకులు ముఠా గణేష్, రవీందర్, శీలం శివలింగం, సర్వేష్, శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# మల్యాలలో వివాహిత ఆత్మహత్య కుమారుడి ఆచూకీ కోసం గాలింపు



**మల్యాల, సెప్టెంబర్ 10 (ప్రజామంతలు):** మల్యాల మండలం ముత్యంపేట శివారులోని వ్యవసాయ బావిలో దూకి ఓ వివాహిత తన చిన్న కుమారుడితో కలిసి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం చోటుచేసుకుంది.మల్యాలకు చెందిన గుండేటి కవిత (36) తన భర్త దశరథంతో కలిసి నివసిస్తోంది. ఆమెకు ఇద్దరు కుమారులు ఉన్నారు. గురువారం గుడిపేట శివారులోని వ్యవసాయ బావి వద్ద కవితకు సంబంధించిన చెప్పులు, సెల్‌ఫోన్‌ను గుర్తించినట్లు సమాచారం. తాను ఆత్మహత్య చేసుకోబోతున్నట్లు తన సోదరుడు కొమురయ్యకు ఫోన్‌లో తెలిపినట్లు తెలుస్తోంది.బావిలో గాలింపు చేపట్టిన పోలీసులు కవిత మృతదేహాన్ని వెలికితీశారు. అయితే ఆమెతో పాటు బావిలోకి దూకినట్లు భావిస్తున్న చిన్న కుమారుడు శశాంక్ ఆచూకీ ఇంకా లభించలేదు. బాలుడి కోసం పోలీసులు గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు.ఈ ఘటనపై మల్యాల ఎస్ఐ సందీప్ దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు గల పూర్తి కారణాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

# చాకలి ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం



**సికింద్రాబాద్, సెప్టెంబర్ 10 (ప్రజా మంటలు):** సికింద్రాబాద్ బౌద్ధనగర్ డివిజన్ ఏకశిలా చౌరస్తాలో గురువారం వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. జాతీయ చేనేత అధ్యక్షుడు డాక్టర్ చిక్క దేవదాసు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ అధ్యక్షుడు మంద జగన్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఐలమ్మ అన్యాయాన్ని ఎదిరించి సామాజిక న్యాయం, ఆత్మగౌరవం కోసం పోరాడారని డాక్టర్ చిక్క దేవదాసు అన్నారు. కార్యక్రమంలో జానకిరామ్, సచిన్, జింకల మల్లేష్, తుకారాం, చింతకింది మల్లేష్, శీలం సాయి యాదవ్, వైట్ల వెంకటాద్రి, సాయి చరణ్ గంగపుత్ర, తవుటం సతీష్, దిండిగల శ్రీకాంత్, చితురాల శ్రీనివాస్, ఎండి అక్బర్, రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# కనీస వేతన సలహా బోర్డు నుంచి సీఐటీయూ ను మినహాయించడం దుర్మార్గం

**సీఐటీయూ జగిత్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి జంగిలి ఎల్లయ్య.**



**ప్రజా మంటలు :** కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలకు మరో నిదర్శనం కేంద్ర కనీస వేతన సలహా బోర్డు పునర్వ్యవస్థీకరణలో ప్రధాన కేంద్ర కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం లెకుండా చెయాడాన్ని ఖండిస్తూ గొల్లపల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈసందర్భంగా సీఐటీయూ జగిత్యల జిల్లా కార్యదర్శి జంగిలి ఎల్లయ్యమాట్లాడుతూ కార్మికుల కనీస వేతనాలు, జీవన ప్రమాణాలు, ఉపాధి పరిస్థితులకు సంబంధించిన అత్యంత కీలకమైన అంశంపై నిర్ణయాలు తీసుకునే కనీస వేతన సలహా బోర్డులో సీఐటీయూ ఏఐటీయూసీ , ఐఎన్టియుసి వంటి దేశంలోని ప్రధాన కేంద్ర కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించకపోవడం పూర్తిగా అప్రజాస్వామికం, కక్షపూరితమైన చర్య అని విమర్శించింది. 2026 జూలై 21న కేంద్ర ప్రభుత్వం పునర్వ్యవస్థీకరించిన కేంద్ర కనీస వేతన సలహా బోర్డు, వాస్తవానికి కార్మికుల ప్రయోజనాలను కాపాడాల్సిన త్రైపాక్షిక వేదికగా ఉండాలి. అయితే ప్రధాన కార్మిక సంఘాలను పక్కన పెట్టి, తనకు అనుకూలమైన వారితో బోర్డును ఏర్పాటు చేయడం ద్వారా కార్మికుల వేతనాలను అణచివేయడానికి, యజమానులకు అనుకూలమైన విధానాలను చట్టబద్ధం చేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోంది.కార్పొరేట్ సంస్థలకు "ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్" పేరుతో అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తూ, కార్మికులకు మాత్రం "ఈజ్ ఆఫ్ ఎక్స్‌ప్లాయిటేషన్" పరిస్థితులను మోదీ ప్రభుత్వం సృష్టిస్తోంది. కార్మిక కోడ్‌ల పేరుతో కార్మికుల హక్కులను హరించిన కేంద్ర ప్రభుత్వం, ఇప్పుడు కనీస వేతనాల నిర్ణయ ప్రక్రియలో కూడా కార్మిక సంఘాల గొంతును నొక్కివేయడానికి ప్రయత్నిస్తోంది. దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు, ఇంధన ధరలు, విద్యుత్ చార్జీలు, వైద్యం, విద్య, ఇల్లు, రవాణా ఖర్చులు నిరంతరం పెరుగుతున్నప్పటికీ, కార్మికుల నిజమైన ఆదాయాలు మాత్రం పడిపోతున్నాయి. మరోవైపు కార్పొరేట్ సంస్థలకు భారీ రాయితీలు, పన్ను మినహాయింపులు, ప్రజా ఆస్తుల అప్పగింతలు కొనసాగుతున్నాయి. కార్మికుల కనీస వేతనాల నిర్ణయంలో ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్‌లో ఏకాభిప్రాయంతో వచ్చిన సిఫారసులను కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలి. కార్మిక కుటుంబం గౌరవప్రదంగా జీవించేందుకు అవసరమైన వేతనం లభించేలా కనీస వేతనాలను శాస్త్రీయంగా నిర్ణయించాలి. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలను సవరించాలి.కానీ మోదీ ప్రభుత్వం కార్మిక సంఘాలతో చర్చించి పరిష్కారం కనుగొనే బదులు, కార్మిక సంఘాల ప్రాతినిధ్యాన్ని తొలగించి ఏకపక్ష నిర్ణయాలకు మార్గం సుగమం చేస్తోంది. సీఐటీయూ ను కనీస వేతన సలహా బోర్డు నుంచి తప్పించడం ద్వారా దేశంలోని కోట్లాది కార్మికుల సమస్యలను, వారి హక్కుల కోసం జరుగుతున్న పోరాటాన్ని అణచివేయలేరని సీఐటీయూ తెలంగాణ రాష్ట్ర కమిటీ స్పష్టం చేసింది. కార్మికుల హక్కుల కోసం సీఐటీయూ పోరాటం బోర్డుల్లోని ప్రాతినిధ్యంతో ప్రారంభమైందీ కాదు, ప్రాతినిధ్యం లేకపోవడంతో ఆగేదీ కాదు. కర్మాగారాల్లో, నిర్మాణ రంగంలో, రవాణా రంగంలో, అసంఘటిత రంగంలో, స్కీమ్ వర్కర్లలో, గిగ్--ప్లాట్‌ఫామ్ కార్మికుల్లో, ప్రభుత్వ--ప్రైవేటు రంగాల్లో పనిచేస్తున్న కోట్లాది కార్మికులతో కలిసి సీఐటీయూ నిరంతరం పోరాడుతుంది. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఈ కక్షపూరిత వైఖరిని తెలంగాణలోని కార్మికవర్గం, అన్ని కేంద్ర కార్మిక సంఘాలు, ఉద్యోగ సంఘాలు, అసంఘటిత రంగ కార్మికులు ఐక్యంగా ఖండించాలని సీఐటీయూ జగిత్యాల జిల్లా కమిటీ పిలుపునిస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో గొల్లపల్లి మండల అధ్యక్షులు జంగిల్ ఎల్లయ్య ప్రధాన కార్యదర్శి శాతల మహేష్ తడగొండ సురేష్ చెలమది రాజయ్య గంగ స్వామి నక్క గణేష్ గంగాధర పోసవ లక్ష్మి కాల్ లక్ష్మి నల్వాల జమున చెవులమద్ది రాయలింగు తదితరులు పాల్గొన్నారు.

# దళితులను అవమానిస్తే ఖబడ్దార్!

**దళితులు నడిచిన నేలను పాలు, పసుపు నీళ్లతో శుద్ధి చేయడం**

**అత్యంత హేయమైన చర్య మండల కాంగ్రెస్ పార్టీ**



**గొల్లపల్లి సెప్టెంబర్ 10 ప్రజా మంటలు :** దళితులు నడిచిన నేలను,పసుపు నీళ్లతో శుద్ధి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని గొల్లపల్లి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. కంప్యూటర్ యుగంలో కూడా కుల వివక్షను ప్రదర్శించే ఇలాంటి చర్యలు సమాజాన్ని అవమానించేలా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి చిర్ర దిలీప్ మాట్లాడుతూ.. శాసనసభ సమావేశాలు జరుగుతున్న సమయంలో ప్రతిపక్ష నాయకులు సభకు హాజరై ప్రజా సమస్యలను లేవనెత్తాలని, వాటిపై ప్రభుత్వం చర్చించి పరిష్కార మార్గాలు చూపాలని అన్నారు. అయితే ప్రజా సమస్యలపై చర్చించాల్సిన ప్రతిపక్షాలు ఆ దిశగా కాకుండా గొడవలు సృష్టించడానికే ప్రాధాన్యం ఇస్తున్నాయని విమర్శించారు, మండల కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి జెల్ల అనిల్ మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతిని బీఆర్ఎస్ పార్టీ నాయకులు సహించలేకపోతున్నారని విమర్శించారు. దళితులు నడిచిన నేలను,పసుపు నీళ్లతో శుద్ధి చేయడం అత్యంత నీచమైన చర్య అని అన్నారు. ఇది కేవలం కొంతమంది వ్యక్తులను అవమానించడం కాదని, యావత్ దళిత సమాజాన్ని అవమానించడమేనని మండిపడ్డారు.కుల వివక్షకు తావులేని సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచే చర్యలను తీవ్రంగా వ్యతిరేకించాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి జెల్లా అనిల్, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి చిర్ర దిలీప్, సర్పంచులు మేక స్వామి,దస్తగిరి, చంద్రశేఖర్,ఉప సర్పంచ్ బుచ్చి రెడ్డి, నేరెళ్ల మహేష్,నాయకులు చిర్ర గంగాధర్ కొక్కుల జలందర్,నక్క గంగరాజు, శనిగారాపు మల్లేశం, పస్తం నారాయణ, రమేష్ రెడ్డి,సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

# చాకలి ఐలమ్మ ఆశయ సాధనకు కృషి చేద్దాం

**చాకలి ఐలమ్మకు నివాళులర్పిస్తున్న అన్ని కుల సంఘాల నాయకులు**



**ఎల్కతుర్తి సెప్టెంబర్ 10 ప్రజా మంటలు :** వీరవనిత చాకలి ఐలమ్మ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రజక సంఘం నాయకులు తంగెళ్ళపల్లి రాజ్ కుమార్ అన్నారు. ఎల్కాతుర్తి రజక సంఘం అధ్యక్షులు అంచనగిరి రవి( సల్మాన్) బస్టాండ్ సమీపాన అంబేద్కర్ జంక్షన్ వద్ద రజక సంఘం మరియు వివిధ పార్టీల,కుల సంఘాల నాయకుల ఆధ్వర్యంలో వీరనారి చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తంగళ్ళపల్లి రాజ్ కుమార్ అధ్యక్షత వహించగా అన్ని సంఘాల నాయకులు చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ వివిధ కులసంఘాల నాయకులు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ ధైర్యసాహసాలతో పోరాడి అణగారిన వర్గాల్లో స్ఫూర్తిని నింపారని అన్నారు. భూస్వామ్య, పెత్తందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా ఆమె చేసిన పోరాటం చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఐలమ్మ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు తంగళ్ళపల్లి రమేష్, మండల అధ్యక్షులు సబ్బు కొమురయ్య, భువనగిరి స్వామి, అంచనగిరి సల్మాన్, గుడెల్లి శ్రీనివాస్, బోనగిరి సమ్మయ్య, వీరభద్ర బోనగిరి కోటి అశోక్ చీకటి లక్ష్మణ్ గ్రామ ముఖ్య అతిథులు సర్పంచ్, ఉప సర్పంచ్ గోడిశాల రాజు, మాజీ సర్పంచ్ కాంగ్రెస్ నాయకులు గోడిశాల యాదగిరి గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాజయ్య గౌడ్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు శీలం అనిల్ కుమార్, సీనియర్ నాయకులు డాక్టర్ రమేష్, శనిగరపు వెంకటేష్, బిఆర్ఎస్ నాయకులు అల్లం కొండ రాజు, గొడిశాల వినయ్ గౌడ్, కల్లుగీత కార్మిక సంఘం అధ్యక్షులు జనగాని లక్ష్మీనారాయణ గౌడ్, ప్రధాన కార్యదర్శి బత్తిని శ్రీనివాస్, కల్లు గీత కార్మిక సంఘం సోషల్ మీడియా కన్వీనర్, సీనియర్ జర్నలిస్ట్ జనగాని ప్రవీణ్ గౌడ్, కందుకూరి మహేష్ చారి, రమేష్ చారి, వెంకటరమణ, వివిధ గ్రామ సంఘ పెద్దలు కమిటీ సభ్యులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సహకార సంఘం చైర్మన్‌గా ఎలిగేటి ఇంద్రసేనారెడ్డి

**రైతులకు మెరుగైన సేవలందించడమే లక్ష్యం**





**ఎల్కతుర్తి ఆగస్టు 10 ప్రజా మంటలు :** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి సహకార సంఘం చైర్మన్‌గా ఎలిగేటి ఇంద్రసేనారెడ్డి నియమి తులయ్యారు. ఆయనతో పాటు సహకా ర సంఘం డైరెక్ట ర్లుగా శనిగరపు స్వరూప, ఎడవల్లి అశోక్‌రెడ్డి, పుల్లూరి నర్సింహారావు, బొమ్మరబోయిన కుమారస్వామి, చిర్ర రాజయ్య, చల్ల ధనలక్ష్మి, మోడం రాజయ్య, ఇనుగాల సుధాకర్, బక్కయ్య, వీరమల్ల ముకుందరెడ్డి, మద్దె రాములు నియమితులయ్యారు.ఎల్కతుర్తి సహకార సంఘం పరిధిలోని రైతులకు అవసరమైన సహకార సేవలను మరింత మెరుగుపరచాల్సిన బాధ్యత నూతన పాలకవర్గంపై ఉంది. రైతులకు పంట రుణాలు, వ్యవసాయానికి అవసరమైన ఎరువులు, విత్తనాలు తదితర సేవలను సకాలంలో అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, సహకార సంఘం కార్యకలాపాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది.రైతులు ఎదుర్కొంటున్న రుణాలు, వ్యవసాయ పెట్టుబడులు, పంటల సాగుకు సంబంధించిన సమస్యలను పాలకవర్గం దృష్టికి తీసుకువచ్చి పరిష్కారానికి కృషి చేయాలని రైతులు కోరుతున్నారు. సహకార సంఘం ద్వారా రైతులకు పారదర్శకంగా సేవలు అందించి, సంఘం అభివృద్ధికి నూతన చైర్మన్, డైరెక్టర్లు కృషి చేయాలని పలువురు ఆకాంక్షించారు.నూతన పాలకవర్గం బాధ్యతలు స్వీకరించడంతో ఎల్కతుర్తి సహకార సంఘం కార్యకలాపాలు మరింత చురుకుగా సాగుతాయని, రైతులకు మరింత ప్రయోజనం చేకూరుతుందని ఆశాభావం వ్యక్తమవుతోంది.

# ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి సీఎం రేవంత్‌ను కలిసిన ఉద్యోగ సంఘ నెతలు



**హైదరాబాద్, సెప్టెంబర్ 10 (ప్రజా మంటలు):** తెలంగాణ ఉద్యోగుల జేఏసీ (౧+జుజీూజ) చైర్మన్ వి. లచ్చి రెడ్డి, సెక్రటరీ జనరల్ ఒడ్నాల రాజశేఖర్ గురువారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కోరారు.ఈ సందర్భంగా ప్రధానంగా పీఆర్సీ అమలు, పెండింగ్ డీఏల విడుదల, సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ పునరుద్ధరణతో పాటు ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన పలు సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు.సమస్యలపై సీఎం రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు ౧+జుజీూజ నాయకులు తెలిపారు. వచ్చే సోమవారం జరిగే సమావేశంలో ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై సమగ్రంగా చర్చించి, పీఆర్సీ, డీఏ, సీపీఎస్ తదితర డిమాండ్ల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పట్ల ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించడం పట్ల జేూజ నాయకత్వం హర్షం వ్యక్తం చేసింది. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం జేఏసీ నిరంతరం కృషి చేస్తుందని నాయకులు తెలిపారు.ముఖ్యమంత్రిని కలిసిన వారిలో అధ్యక్షులు ఎస్. రాములు, ప్రధాన కార్యదర్శి పాక రమేష్, ౧+=ూా అధ్యక్షులు బాణాల రాంరెడ్డి, నాయకులు గరికె ఉపేంద్ర రావు తదితరులు ఉన్నారు.

# మానవ మేధస్సుకు ఏదీ సాటిరాదు

**మాజీమంత్రి మర్రి శశిధర్‌రెడ్డి**



**సికింద్రాబాద్, సెప్టెంబర్ 10 (ప్రజా మంటలు):** కృత్రిమ మేధస్సు (ఏఐ) ఎప్పటికీ మానవ మేధస్సుకు ప్రత్యామ్నాయం కాబోదని మాజీ మంత్రి, బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు మర్రి శశిధర్‌రెడ్డి స్పష్టం చేశారు. నాచారంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ 21వ వార్షికోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ..ఏఐ అనేది మానవ శక్తిని రెట్టింపు చేసే ఒక సాధనం మాత్రమేనని, సాంకేతికత రెండు వైపులా పదునున్న కత్తి లాంటిదని పేర్కొన్నారు. దాన్ని ఎలా సద్వినియోగం చేసుకుంటారనే దానిపైనే భావి తరాల భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని హితవు పలికారు. ఈ వేడుకల్లో డీపీఎస్ చైర్మన్, ఎమ్మెల్సీ మల్క కొమరయ్య, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్-అటవీ శాఖల మధ్య మరింత సమన్వయం

**అటవీ సంపద, వన్యప్రాణుల రక్షణకు చర్యలు**

**- జిల్లా ఎస్పి అశోక్ కుమార్**






**( - చుక్క గంగారెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ - జగిత్యాల జిల్లా) :** జిల్లాలో అటవీ సంపద, వన్యప్రాణుల రక్షణకు పోలీస్, అటవీ శాఖలు పరస్పర సమన్వయంతో మరింత సమర్థవంతంగా పనిచేయాలని జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ సూచించారు. ఈ రోజు జిల్లా పోలీస్ ప్రదాన కార్యాలయంలో పోలీస్, అటవీ శాఖల అధికారులతో నిర్వహించిన కోఆర్డినేషన్ సమావేశంలో జిల్లాలో అటవీ పరిరక్షణకు సంబంధించి చేపడుతున్న చర్యలు, ఇరు శాఖలు ఎదుర్కొంటున్న సమస్యలు, పరస్పర సహకారం అవసరమైన అంశాలపై ఎస్పీ సమీక్ష నిర్వహించారు. అటవీ ప్రాంతాల్లో జరుగుతున్న అక్రమ కార్యకలాపాలు, అక్రమ కలప రవాణా, వన్యప్రాణుల వేట, అటవీ భూముల ఆక్రమణ తదితర అంశాలపై ప్రత్యేకంగా చర్చించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. అటవీ భూములు ఆక్రమణ, అక్రమ కలప రవాణా, వన్యప్రాణుల వేటను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించవద్దని అధికారులకు సూచించారు. అటవీ ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలపై నిఘా పెంచాలని, అక్రమ రవాణాకు పాల్పడుతున్న వ్యక్తులపై సమాచారాన్ని సేకరించి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. అవసరమైన ప్రాంతాల్లో తనిఖీలు ముమ్మరం చేయడంతో పాటు, అటవీ శాఖకు అందుబాటులో ఉన్న సమాచారాన్ని పోలీస్ శాఖతో పంచుకోవాలని సూచించారు. అటవీ భూముల ఆక్రమణకు సంబంధించిన అంశాలపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ పేర్కొన్నారు. అటవీ భూముల్లో అనధికారికంగా చేపడుతున్న కార్యకలాపాలను గుర్తించి, సంబంధిత శాఖల సమన్వయంతో వాటిని అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని అన్నారు. వన్యప్రాణుల సంరక్షణలో భాగంగా వేటగాళ్ల కదలికలపై నిఘా పెంచాలని, అటవీ ప్రాంతాలకు సమీపంలోని గ్రామాల ప్రజలతో సమన్వయం చేసుకుని అనుమానాస్పద కార్యకలాపాలపై సమాచారం సేకరించాలని తెలిపారు. అటవీ ప్రాంతాలకు సమీపంలోని గ్రామాల్లో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, వన్యప్రాణుల వేట, కలప అక్రమ రవాణా, అటవీ భూముల ఆక్రమణ వల్ల కలిగే నష్టాలపై వివరించాలని సూచించారు.ఈ సమావేశంలో అదనపు ఎస్పి చేతన్ నితిన్, డీఎఫ్ఓ రవి ప్రసాద్, డిఎస్పి రాములు, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ లు సి.ఐలు ,ఎస్.ఐ లు పాల్గొన్నారు.ద

# గణేష్ ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించుకోవాలి.

**టౌన్ సిఐ కరుణాకర్.**



**జగిత్యాల జిల్లా ప్రతినిధి, ( ప్రజా మంటలు) సెప్టెంబర్ 10 :** గణేష్ మండప నిర్వాహకులు రాబోయే గణేష్ ఉత్సవాలను ప్రజా జీవనానికి భంగం కలగకుండా భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని టౌన్ సిఐ కరుణాకర్ తెలిపారు. విద్యుత్ తీగలకు దగ్గరగా గణేష్ మంటపాలను నిర్మించకుండా జాగ్రత్త పడాలని సూచించారు. ట్రాఫిక్ అంతరాయం లేకుండా మంట పాలను ఏర్పాటు చేసుకోవాలని, గణేష్ మండపాల్లో భక్తి పాటలు మాత్రమే వేయాలని సూచించారు. హిందూ సంస్కృతిని ప్రతిబింబించే విధంగా యూత్ పేర్లు పెట్టుకోవాలన్నారు. గణేష్ ఆగమన్ కార్యక్రమాలను ట్రాఫిక్ కు అంతరాయం లేకుండా నిర్వహించాలని సిఐ అన్నారు. జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ సూచన మేరకు డిఎస్పి పురుషోత్తం రెడ్డి ఆధ్వర్యంలో "ఈనెల 12వ తేదీ శనివారం దేవిశ్రీ గార్డెన్ లో గణేష్ మంటప నిర్వాహకులతో సమావేశం" ఉంటుందని ఈ సమావేశంలో మంట పాల నిర్వాహకులు, గణేష్ ఉత్సవ సమితి సభ్యులు పాల్గొనాలని సిఐ కోరారు.

# తనకు న్యాయం చేయాలంటూ గవర్నర్ అబ్దుల్ నజీర్‌ని కలిసిన మేఘన

**తనకు న్యాయం జరిగేలా ఆదేశించాలంటూ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌కి వినతి పత్రం అందించిన మేఘన**

**విజయవాడ లోక్ భవన్‌లో గవర్నర్‌ను కలిసిన మేఘన**

**గవర్నర్ అబ్దుల్ నజీర్‌ని కలిసిన మేఘన**



మాజీ మంత్రి జోగి రమేష్ కోడలు మేఘన తనకు న్యాయం జరిగేలా ఆదేశించాలంటూ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌కి వినతి పత్రం అందించారు. విజయవాడ లోక్ భవన్‌లో గవర్నర్‌ను కలిసి తన పరిస్థితిని వివరించారు. ఉమ్మడి నల్గొండ జిల్లా సూర్యాపేటకు చెందిన జోగి మేఘన తనని భర్త రాజీవ్, అత్తమామలు జోగి రమేష్, శకుంతల, ఇతర కుటుంబ సభ్యులు పెట్టిన ఇబ్బందులు, కట్నం వేధింపులు, హత్యాయత్నాల ఉదంతం సమగ్రంగా వినతిపత్రంలో వివరించారు.అదనపు కట్నం కోసం : వివాహం అనంతరం అదనపు కట్నం కోసం అత్తింటి వారు సాగించిన చర్యలపై ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారని, తన ప్రాణాలకు రక్షణ కల్పించాలంటూ బాధితురాలు మేఘన గవర్నర్‌ను కోరారు. మేఘనకు మాజీ మంత్రి జోగి రమేష్ కుమారుడు రాజీవ్‌తో 2025 మే 28న సూర్యాపేటలో అట్టహాసంగా వివాహం జరిగింది. రూ. 5 కోట్లకు పైగా ఖర్చు పెట్టి, 1.5 కిలోల బంగారం, 10 కిలోల వెండి, అడపడుచు కట్నం కింద రూ. 9 లక్షలు నగదు ముట్టజెప్పినప్పటికీ అత్తింటి వారి ఆశలు తీరలేదు. వివాహం ముగిసిన వెంటనే భర్త రాజీవ్ 1), అతని తండ్రి జోగి రమేష్ (2), తల్లి శకుంతల (3), ఆడపడుచు రేష్మ ప్రియాంక (4) తదితరులు అదనంగా రూ. 5 కోట్లు, టయోటా ఫార్చ్యూనర్ కారు, వజ్రాల హారాలు తేవాలంటూ శారీరకంగా, మానసికంగా వేధించారని మేఘన పేర్కొన్నారు. బోటులో నుంచి తోసేయడానికి 2025 జూలై 7న గోవాలోని 'బిగ్ డాడీ క్యాసినో' నుంచి బోటులో తిరుగు ప్రయాణంలో ఈత రాని తనను బోటులో నుంచి తోసేయడానికి భర్త రాజీవ్ యత్నించారన్నారు. 2025 జూలై 10న హైదరాబాద్‌లోని ఓ విల్లాలో, ఆపై ఘట్‌కేసర్ ఫామ్‌హౌస్‌లో భర్త, అత్తమామలు, మరిది రోహిత్ తదితరులు విచక్షణారహితంగా కొట్టి, దిండుతో ఊపిరాడకుండా చేసి హత్యాయత్నం చేశారని తన వినతి పత్రంలో మేఘన పేర్కొన్నారు. ఆగస్టు 2025లో ఇబ్రహీంపట్నంలోని అత్తగారి ఇంటి టెర్రస్ పైకి లాకెళ్లి తనను కిందికి తోసేసేందుకు యత్నించి, ఇది కేవలం 'ట్రయిల్' మాత్రమేనని బెదిరించారన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 13 అర్ధరాత్రి దాటిన తర్వాత అత్తామామలు కాళ్ల చేతులు పట్టుకుని గోడకేసి కొట్టగా, భర్త రాజీవ్ చున్నీతో గొంతు బిగించి చంప బోయడని కాళ్లావేళ్లా పడితే తప్ప తన ప్రాణాలు దక్కలేదన్నారు.హిందూ పూజలు చేయకుండా పెళ్లికి ముందే రాజీవ్ కుటుంబం క్రైస్తవ మతంలోకి మారిందన్న సత్యాన్ని తమ కుటుంబానికి తెలియకుండా పూర్తిగా దాచారని, పెళ్లయ్యాక ఈ విషయం తెలుసుకుని తాను నిలదీయడంతో పాటు, హిందూ పూజలు చేయకుండా అడ్డుకున్నారని మేఘన తెలిపారు. మతం మారాలని తీవ్ర ఒత్తిడి తెచ్చారన్నారు. ఈ విషయాలను బయటపెడితే తమకున్న రాజకీయ పలుకుబడితో రౌడీలను అడ్డం పెట్టుకుని తల్లిదండ్రులతో సహా అంతమొందిస్తామని హెచ్చరించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై తాను ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇబ్రహీంపట్నం పోలీసులు ఎఫ్‌ఐఆర్ నెం. 326/2026 నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారన్నారు. అయితే, నిందితులు రాజకీయ పలుకుబడిని ఉపయోగించి కేసును నీరుగారుస్తున్నారని, తమ ప్రాణాలకు ఎప్పుడైనా ముప్పు వాటిల్లే ప్రమాదముందని ఆవేదన వ్యక్తం చేశారు. నిందితుల నుంచి తమకు, తమ తల్లిదండ్రులకు రక్షణ కల్పించాలని, ఎఫ్ఐఆర్ నిష్పక్షపాతంగా దర్యాప్తు జరిపించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.

# హైదరాబాద్‌లో బుల్లెట్ ట్రైన్ హబ్ ప్రాథమిక నోటిఫికేషన్ జారీ

**బహదూర్‌గూడలో 796.28 ఎకరాల భూమిని సేకరించనున్న అధికారులు**

**ఇంటిగ్రేటెడ్ మొబిలిటీ హబ్ పేరిట ఏర్పాటు**

**శంషాబాద్ విమానాశ్రయ రన్‌వేకు కూతవేటు దూరంలో బుల్లెట్ ట్రైన్ హబ్**

తెలంగాణ రవాణా రంగాన్ని సరికొత్త శిఖరాలకు తీసుకెళ్లేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రతిష్ఠాత్మక అడుగులు వేస్తున్నాయి. ఇందులో భాగంగా కేంద్ర ప్రభుత్వం హైదరాబాద్‌లో ఏర్పాటు చేయనున్న బుల్లెట్ ట్రైన్ హబ్‌కు మొదటి అడుగు పడింది. హైదరాబాద్ మహా నగరాన్ని దేశంలోనే మొట్టమొదటి హైస్పీడ్ బుల్లెట్ ట్రైన్ కనెక్టివిటీ కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో బుల్లెట్ ట్రైన్ హబ్‌ను శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో భారీ ఇంటిగ్రేటెడ్ మొబిలిటీ హబ్ పేరిట (సమీకృత సమగ్ర రవాణా కేంద్రం) ఏర్పాటు చేయబోతున్నారు. ఈ మెగా మల్టీ మోడల్ ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను రంగారెడ్డి జిల్లా రెవెన్యూ అధికారులు అధికారికంగా ప్రారంభించారు.సర్వీస్ రోడ్డును ఆనుకుని ఈ భారీ మౌలిక సదుపాయాల ప్రాజెక్టు కోసం శంషాబాద్-తుక్కుగూడ ఔటర్ రింగ్ రోడ్డు సర్వీస్ రోడ్డును ఆనుకుని ఉన్న బహదూర్‌గూడ పరిధిలో 796.28 ఎకరాల భూమిని సేకరించనున్నారు. ఈ మేరకు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఈ ప్రక్రియ కోసం ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ నోటిఫికేషన్ ప్రకారం సేకరిస్తున్న మొత్తం స్థలంలో సర్వే నంబర్లు 28, 62 పరిధిలోని 750 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా, మిగిలిన 46.28 ఎకరాలు ప్రైవేటు, పట్టా భూములుగా అధికారులు గుర్తించారు. నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో కలెక్టర్ ముందస్తు అనుమతి లేకుండా ఈ భూముల్లో ఎలాంటి లావాదేవీలు లేదా ల్యాండ్ డెవలప్‌మెంట్ పనులు చేపట్టరాదని రెవెన్యూ యంత్రాంగం స్పష్టం చేసింది. ఈ ప్రతిపాదనలపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే 60 రోజుల్లోగా లిఖితపూర్వకంగా తెలియజేయవచ్చని పేర్కొంది.ప్రయాణికులు నేరుగా సీఎం రేవంత్ రెడ్డి సరిగ్గా ఆరు నెలల క్రితం తీసుకున్న నిర్ణయం మేరకు ఈ ప్రాంతాన్ని ఎంపిక చేశారు. విమానాశ్రయ రన్‌వేకు అత్యంత సమీపంలో ఉండటం వల్ల భవిష్యత్తులో విమాన ప్రయాణికులు నేరుగా బుల్లెట్ రైలు సేవలను వినియోగించుకోవడానికి వీలవుతుంది. ఈ బహదూర్‌గూడ హబ్ కేంద్రంగా హైదరాబాద్-ముంబయి, హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్-చెన్నై (వయా అమరావతి) వంటి మూడు ప్రధాన హైస్పీడ్ బుల్లెట్ రైలు కారిడార్ల కార్యకలాపాలను నిర్వహించనున్నారు. ఈ ప్రాజెక్టు అందుబాటులోకి వస్తే హైదరాబాద్ నుంచి ముంబయి, బెంగళూరు,



చెన్నై నగరాలకు ప్రయాణ సమయం కేవలం 2 గంటలకు తగ్గిపోనుంది.ఒకే చోట మెట్రో, అంతర్రాష్ట్ర బస్సులు అంతేకాకుండా ఈ సమగ్ర రవాణా కేంద్రంలో 150 ఎకరాల్లో ఒక ఇంటర్నేషనల్ లెవెల్ మెగా బస్ టెర్మినల్‌ను కూడా నిర్మిస్తున్నారు. ఈ హబ్‌ను ప్రతిపాదిత నాగోల్-శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో కారిడార్‌తో అనుసంధానించడం ద్వారా ప్రయాణికులు ఒకే చోట మెట్రో, అంతర్రాష్ట్ర బస్సులు, బుల్లెట్ రైళ్లు, విమాన ప్రయాణ సదుపాయాలను పొందవచ్చు. తద్వారా ఈ ప్రాంతం దక్షిణ భారతదేశంలోనే అత్యంత కీలకమైన, అతిపెద్ద ఆర్థిక-రవాణా హబ్‌గా అవతరించనుంది

# పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగార్థులకు గుడ్‌న్యూస్ వయో పరిమితి మరో మూడేళ్లు పెంపు

**కానిస్టేబుల్ పోస్టులకు మూడేళ్ల వయోపరిమితి పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం**

**ఎస్ఐ ఉద్యోగాలతో సమానంగా కానిస్టేబుల్ అభ్యర్థుల వయోపరిమితి పెంపు**

**కానిస్టేబుల్ ఉద్యోగాలకు వయోపరిమితి 32 ఏళ్లకు పెంపు**




పోలీస్, ఫైర్, జైళ్లు, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్‌పీఎఫ్) తదితర శాఖల్లో కానిస్టేబుల్ సమాన స్థాయి పోస్టుల డైరెక్ట్ రిక్రూట్‌మెంట్‌కు సంబంధించి గరిష్ఠ వయో పరిమితిని ప్రభుత్వం మరో మూడేళ్లు పెంచింది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ బుధవారం ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను జారీ చేసింది. ప్రభుత్వం గతంలో వివిధ ఉత్తర్వుల ద్వారా యూనిఫాం సర్వీసుల్లో ప్రత్యక్ష నియామకాలకు గరిష్ఠ వయో పరిమితిని ఏడు సంవత్సరాల పాటు పెంచింది. అయితే హోంశాఖలో సబ్ ఇన్‌స్పెక్టర్, కానిస్టేబుల్ పోస్టులకు నిర్దేశించిన వయో పరిమితుల్లో వ్యత్యాసం ఉందని సర్కారు గుర్తించింది.కానిస్టేబుల్ పోస్టులకు మూడేళ్ల వయో పరిమితి పెంపు ప్రస్తుతం సబ్ ఇన్‌స్పెక్టర్ పోస్టులకు గరిష్ఠ వయో పరిమితి 32 ఏళ్లు కాగా, కానిస్టేబుల్ పోస్టులకు 29 ఏళ్లుగా ఉండటాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పరిశీలించింది. ఈ వ్యత్యాసాన్ని తొలగించే ఉద్దేశంతో కానిస్టేబుల్, సమాన స్థాయి పోస్టులకు మరో మూడేళ్ల వయో పరిమితి సడలింపు ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది. ఈ తాజా నిర్ణయం ప్రకారం పోలీస్, ఫైర్ సర్వీసెస్, ప్రిజన్స్, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్‌లోని కానిస్టేబుల్, తత్సమాన స్థాయి పోస్టులకు వయో పరిమితి మరో మూడు సంవత్సరాలు పెరుగుతుంది.అయితే పోలీస్ శాఖలోని పీసీ డ్రైవర్ ఉద్యోగాలకు మాత్రం ఈ పెంపు వర్తించదు. గతంలో ఇచ్చిన ఏడేళ్ల వయో పరిమితి పెంపునకు అదనంగా ఈ మూడేళ్ల సడలింపు ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నిబంధనలను తెలంగాణ స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు చేపట్టే ప్రత్యక్ష నియామకాలకు వర్తింపజేయనున్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు తదుపరి నోటిఫికేషన్‌ను తెలంగాణ రాష్ట్ర గెజిట్‌లో ప్రచురించనున్నారు.ప్రభుత్వ విప్ బల్మూరి విజ్ఞప్తితో నిర్ణయం పోలీస్ కానిస్టేబుల్ వయో పరిమితి పెంపు అంశాన్ని ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్ అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై వెంటనే సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు వయో పరిమితిని పెంచుతూ జీవో జారీ చేసింది. సర్కారు నిర్ణయంపై ప్రభుత్వ విప్ బల్మూరి హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ సర్కారు తీసుకున్న తాజా నిర్ణయంతో ఎంతోమంది పోలీస్ అభ్యర్థులకు ఊరట లభించిందని, మళ్లీ పరీక్షలు రాసుకునే అవకాశం వచ్చిందన్నారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.పోలీసు ఉద్యోగాల దరఖాస్తు గడువు పెంపు తెలంగాణ పోలీస్ నియామక మండలి బోర్డు చేపట్టిన ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునేందుకు గడువు తేదీని పెంచారు. నేటితో గడువు ముగుస్తుండగా 16వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు పోలీస్ నియామక మండలి ఛైర్మన్ వి.వి.శ్రీనివాసరావు వెల్లడించారు. అగ్నిమాపక-విపత్తు నిర్వహణ, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్, జైళ్ల శాఖల్లో కలిపి మొత్తం 7,437 పోస్టుల భర్తీకి జులై 29న నియామక మండలి నాలుగు వేర్వేరు నోటిఫికేషన్లను విడుదల చేసిన విషయం తెలిసిందే.

# బొల్లారం ఆయుధాల చోరీ కేసులో కీలక మలుపు పోలీసుల అదుపులో ఆర్మీ అధికారి

**బొల్లారం మద్రాస్ రెజిమెంట్ ఆయుధాల చోరీ కేసులో కీలక మలుపు**

**ఒకట్రెండు రోజుల్లో తెరపడే అవకాశాలు**

**కేసు విచారణ విషయాలను అత్యంత గోప్యంగా ఉంచుతున్న పోలీసులు**




బొల్లారంలోని మద్రాస్ రెజిమెంట్ ఆయుధాల చోరీ కేసు కీలక మలుపు తిరిగింది. 10 రోజుల దర్యాప్తు తర్వాత ఓ ఆర్మీ అధికారి చుట్టూ అనుమానాలు బలపడినట్లు సమాచారం. 7 రోజులుగా పోలీస్, ఎన్ఐఏ, ఆర్మీ అధికారులు ఆయనను విడతల వారీగా ప్రశ్నిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో సంచలనం రేపిన ఆయుధాల చోరీ మిస్టరీకి ఒకట్రెండు రోజుల్లో తెరపడే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.రంగంలోకి ఢిల్లీ నుంచి మిలటరీ అధికారులు ఆగస్టు 30వ తేదీన సాయంత్రం 6 గంటల నుంచి 31వ తేదీ ఉదయం 7 గంటల మధ్య బొల్లారంలోని మద్రాస్ రెజిమెంట్‌లో ఆయుధాల చోరీ జరిగింది. లెఫ్టినెంట్ కల్నల్ మయాంక్ గోవిటీర్కార్ ఫిర్యాదుతో బొల్లారం పోలీసులు కేసు నమోదు చేశారు. మొత్తం 12 తుపాకులు, 21 మ్యాగజైన్లు, నైట్ విజన్ బైనాక్యులర్‌తో పాటు 1,912 బుల్లెట్లు చోరీకి గురయ్యాయి. ఘటన తీవ్రతతో ఢిల్లీ నుంచి మిలటరీ ఉన్నతాధికారులు రంగంలోకి దిగారు. మిలటరీ ఇంటెలిజెన్స్, ఎన్ఐఏ, మల్కాజిగిరి పోలీసులు సంయుక్తంగా దర్యాప్తును చేపట్టారు.భద్రపరిచే కోట్ వద్ద విధుల్లో మద్రాస్ రెజిమెంట్‌తో పాటు పరిసర ప్రాంతాల్లోని వందలాది సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలించారు. అయితే ఇప్పటి వరకు ఒక మ్యాగజైన్ మాత్రమే లభించగా, చోరీకి పాల్పడిన వారి ఆచూకీ మాత్రం తెలియలేదు. ఆయుధాలు భద్రపరిచే కోట్ వద్ద విధుల్లో ఉన్న సిబ్బంది, అక్కడికి ప్రవేశించే అధికారం ఉన్నవారిని గుర్తించి మొత్తం 42 మందితో జాబితా సిద్ధం చేశారు. ఒక్కొక్కరినీ విచారణ చేయగా, కొందరికి చోరీతో సంబంధం లేదని నిర్ధారించి దర్యాప్తు నుంచి మినహాయించారు. మిగిలిన వారిని ప్రశ్నిస్తున్న క్రమంలో ఓ ఆర్మీ అధికారి ప్రవర్తనపై బలంగా అనుమానాలు వ్యక్తమైనట్లు సమాచారం.అత్యంత గోప్యంగా విచారణ అంశం ఈ నెల 3 నుంచి ప్రతిరోజూ సదరు అధికారిని పోలీసులు, ఎన్ఐఏ, ఆర్మీ అధికారులు విడతల వారీగా విచారిస్తున్నట్లు తెలుస్తోంది. సహచర సిబ్బంది చెప్పిన విషయాలు, వివిధ కోణాల్లో సేకరించిన సమాచారం ఆధారంగా ప్రశ్నలు వేస్తున్నట్లు సమాచారం. మొత్తం వ్యవహారాన్ని మల్కాజిగిరి పోలీసులు అత్యంత గోప్యంగా ఉంచుతుండటం గమనార్హం. మల్కాజిగిరి డీసీపీ శ్రీధర్ ప్రతి రోజూ బొల్లారం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి దర్యాప్తు పురోగతిని ప్రత్యక్షంగా సమీక్షిస్తున్నారు. ఒకట్రెండు రోజుల్లో కేసులో కీలక పరిణామం వెలుగు చూసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.


# మధు యాష్కీకి జాతీయ పదవి.. ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ ఛైర్మన్‌గా నియామకం

**మేరకు ఉత్తర్వులు జారీ చేసిన కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే**

**తెలంగాణ ఎన్నికల ప్రచార కమిటీ ఛైర్మన్‌గా పనిచేసిన యాష్కీ**

**ఇటీవలి ఎన్నికల్లో ఓటమి తర్వాత జాతీయ స్థాయిలో కీలక బాధ్యతలు**

**మాజీ ఛైర్మన్ ప్రవీణ్ చక్రవర్తి సేవలను ప్రశంసించిన పార్టీ**



తెలంగాణ కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ మధు గౌడ్ యాష్కీకి జాతీయ స్థాయిలో కీలక బాధ్యతలు లభించాయి. ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ (ఏఐపీసీ) నూతన ఛైర్మన్‌గా ఆయనను కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నియమించారు. ఈ మేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత వ్యవహారాలు) కేసీ వేణుగోపాల్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటివరకు ఛైర్మన్‌గా పనిచేసిన ప్రవీణ్ చక్రవర్తి సేవలను పార్టీ ఈ సందర్భంగా ప్రశంసించింది.2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రచార కమిటీ ఛైర్మన్‌గా కీలక పాత్ర పోషించినప్పటికీ, ఎల్బీ నగర్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అయినప్పటికీ, కాంగ్రెస్ అధిష్ఠానానికి అత్యంత సన్నిహితుడిగా పేరున్న యాష్కీకి జాతీయ స్థాయిలో పదవి లభించడం గమనార్హం.నిజామాబాద్ లోక్‌సభ స్థానం నుంచి 2004, 2009లలో వరుసగా రెండుసార్లు ఎంపీగా గెలుపొందిన మధు యాష్కీ, ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి గట్టి మద్దతుదారుగా నిలిచారు. కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ చీఫ్ విప్‌గా కూడా ఆయన సేవలు అందించారు. అయితే, 2014, 2019 లోక్‌సభ ఎన్నికలతో పాటు, 2023 అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఆయన ఓటమి చవిచూశారు.ాతెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి, రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఖాళీ అయిన టీపీసీసీ అధ్యక్ష పదవికి మధు యాష్కీ పేరు ప్రముఖంగా వినిపించింది. అయితే, అధిష్ఠానం ఆ బాధ్యతలను మహేశ్ కుమార్ గౌడ్‌కు అప్పగించింది. ఈ నేపథ్యంలో తాజాగా ఆయనకు జాతీయ పదవి దక్కడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# తిరుమల నడక మార్గంలో మళ్లీ చిరుత.. భక్తుల భయాందోళన


**తిరుమల అలిపిరి నడకమార్గంలో మరోసారి చిరుత సంచారం**

**7వ మైలు వద్ద చిరుతను చూసి భయపడిన భక్తులు**

**నరసింహస్వామి ఆలయం సమీపంలోనూ కనిపించినట్లు సమాచారం**

**భక్తులను గుంపులుగా మాత్రమే అనుమతిస్తున్న తితిదే**

**నడకమార్గంలో భద్రతను పెంచి, నిఘా ఏర్పాటు చేసిన అధికారులు**



తిరుమల శ్రీవారి దర్శనానికి పాద యాత్రగా వెళ్లే భక్తులను వన్యమృగాల భయం మరోసారి వెంటాడింది. అలిపిరి నడకమార్గంలో చిరుత పులి సంచారం కలకలం రేపింది. మెట్ల మార్గంలో 7వ మైలు దాటిన తర్వాత మండపం సమీపంలో చిరుత కనిపించడంతో భక్తులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. కొందరు భయంతో కేకలు వేస్తూ వెనక్కి పరుగులు తీశారు.రెండు రోజుల క్రితం మధ్యాహ్నం 3 గంటల సమయంలో నరసింహస్వామి ఆలయానికి సమీపంలో చిరుత సంచరించినట్లు కొందరు భక్తులు తెలిపారు. తాజాగా 7వ మైలు వద్ద మరోసారి కనిపించడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. వరుస ఘటనలతో నడకమార్గంలో వెళ్లేందుకు భక్తులు జంకుతున్నారు. ముఖ్యంగా పిల్లలతో, వృద్ధులతో కలిసి ప్రయాణించే వారు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.ఈ సమాచారం అందిన వెంటనే తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) విజిలెన్స్ అధికారులు, అటవీ శాఖ సిబ్బంది అప్రమత్తమయ్యారు. భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని నడకమార్గంలో కీలక చర్యలు చేపట్టారు. ప్రస్తుతం భక్తులను ఒంటరిగా అనుమతించకుండా, గుంపులుగా మాత్రమే పంపిస్తున్నారు. చిరుత సంచరించినట్లు చెప్పిన ప్రాంతాల్లో భద్రతా సిబ్బంది గస్తీని ముమ్మరం చేశారు. భక్తులు అప్రమత్తంగా ఉండాలని, ధైర్యంగా గుంపులుగా ప్రయాణించాలని అధికారులు సూచిస్తున్నారు.కాగా, తిరుమల నడకమార్గంలో చిరుతల సంచారం కొత్తేమీ కాదు. గతంలోనూ పలుమార్లు చిరుతలు, ఎలుగుబంట్లు కనిపించడంతో భక్తులు భయాందోళనకు గురైన సంఘటనలు ఉన్నాయి. అప్పట్లో కూడా టీటీడీ ఇలాంటి భద్రతా చర్యలనే అమలు చేసింది.

# ఏపీలో కొత్త ఐఏఎస్ పోస్టింగ్‌లకు బ్రేక్.. గంటల వ్యవధిలోనే ఉత్తర్వులు వెనక్కి

**2024 బ్యాచ్‌కు చెందిన ఏడుగురు అధికారుల నియామకాలు హోల్డ్**

**ఒక బదిలీ సహా అన్ని నియామకాలను తాత్కాలికంగా నిలిపివేస్తూ ఆదేశాలు**

**మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసి, బుధవారం ఉదయానికే నిలిపివేత**




ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నూతన ఐఏఎస్ అధికారుల పోస్టింగ్‌ల విషయంలో కీలక నిర్ణయం తీసుకుంది. 2024 బ్యాచ్‌కు చెందిన ఏడుగురు ఐఏఎస్ అధికారులకు సబ్-కలెక్టర్లుగా పోస్టింగ్‌లు ఇస్తూ జారీ చేసిన ఉత్తర్వులను ప్రభుత్వం తాత్కాలికంగా నిలిపివేసింది. మంగళవారం రాత్రి జారీ అయిన ఈ ఆదేశాలను బుధవారం ఉదయానికల్లా హోల్డ్‌లో పెడుతూ ప్రభుత్వం తిరిగి ఉత్తర్వులు ఇవ్వడం అధికార వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.వివరాల్లోకి వెళితే, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ మంగళవారం రాత్రి 2024 బ్యాచ్‌కు చెందిన ఏడుగురు ఐఏఎస్ అధికారులను వివిధ సబ్-డివిజన్లకు సబ్-కలెక్టర్లుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వుల ప్రకారం సందీప్ రఘువంశీ (తెనాలి), కె. చిరంజీవి నాగవెంకట సహిత (పాడేరు), డి. పృథ్వీ రాజ్ కుమార్ (రంపచోడవరం), చిట్టిపులి నరేంద్ర పాడల్ (చింతూరు), సచిన్ రహర్ (పార్వతీపురం), ఫరీజ్ జహీద్ (పెనుకొండ), మనీషా (నంద్యాల)లకు పోస్టింగ్‌లు ఖరారు చేశారు.అదేవిధంగా, 2023 బ్యాచ్‌కు చెందిన అధికారి, అప్పటి చింతూరు సబ్-కలెక్టర్ శుభమ్ నోఖ్వాల్‌ను రాజమహేంద్రవరం సబ్-కలెక్టర్‌గా బదిలీ చేశారు. ఈ సబ్-డివిజన్లలో పనిచేస్తున్న డిప్యూటీ కలెక్టర్లు, డీఆర్‌ఓలు వెంటనే సాధారణ పరిపాలన శాఖలో (జీఏడీ) రిపోర్ట్ చేయాలని కూడా ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.అయితే, ఈ ఉత్తర్వులు వెలువడిన కొన్ని గంటల్లోనే ప్రభుత్వం వాటిని నిలిపివేసింది. బుధవారం ఉదయం ఈ నియామకాలు, బదిలీలన్నింటినీ హోల్డ్‌లో పెడుతున్నట్లు తాజాగా ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆకస్మిక నిర్ణయానికి గల కారణాలు మాత్రం అధికారికంగా వెల్లడి కాలేదు.

## కరెంట్ కోసం నీళ్లివ్వం.. తెలుగు రాష్ట్రాలకు కేఆర్ఎంబీ స్పష్టీకరణ

**సాగు, తాగునీటికే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కేఆర్ఎంబీ ఆదేశం**

**ఎల్ నినో ప్రభావంతో నీటిని పొదుపుగా వాడాలని తెలుగు రాష్ట్రాలకు సూచన**

**నీటి పంపకాలపై ఏపీ, తెలంగాణ మధ్య మరోసారి భగ్గుమన్న విభేదాలు**

**66:34 నిష్పత్తిలో నీరు కేటాయించాలని కోరుతున్న ఆంధ్రప్రదేశ్**

**50:50 వాటా కావాలని డిమాండ్ చేస్తున్న తెలంగాణ**




ఎల్ నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా శ్రీశైలం, నాగార్జున సాగర్ జలాశయాల్లోని నీటిని అత్యంత పొదుపుగా వినియోగించుకోవాలని ఉభయ తెలుగు రాష్ట్రాలకు కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) సూచించింది. ఉమ్మడి జలాశయాల నుంచి కేవలం విద్యుదుత్పత్తి కోసం నీటిని విడుదల చేయడం సాధ్యపడదని స్పష్టం చేసింది. తాగునీటికి ప్రథమ, సాగునీటికి ద్వితీయ ప్రాధాన్యం ఇచ్చిన తర్వాతే మిగిలిన అవసరాలను పరిగణనలోకి తీసుకోవాలని బోర్డు తేల్చి చెప్పింది.ఈ మేరకు సెప్టెంబరు 4న కేఆర్ఎంబీ సభ్య కార్యదర్శి సతీశ్ కంబోజ్ నేతృత్వంలో జరిగిన త్రిసభ్య కమిటీ సమావేశ మినిట్స్‌ను బోర్డు ఇరు రాష్ట్రాలకు పంపింది. 2026 సెప్టెంబరు నుంచి 2027 ఆగస్టు వరకు సాగునీటి కేటాయింపులపై ఈ సమావేశంలో ఏకాభిప్రాయం కుదరలేదు. ఈ అంశాన్ని త్వరలో జరగనున్న 21వ కేఆర్ఎంబీ పూర్తిస్థాయి సమావేశంలో చర్చించనున్నారు.అయితే, ఈ సమావేశ మినిట్స్‌లో వాస్తవాలను పొందుపరచలేదని, వాటిని తాము అంగీకరించడం లేదని తెలంగాణ నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ రమేశ్ బాబు కేఆర్ఎంబీ ఛైర్మన్‌కు లేఖ రాశారు. మరోవైపు, తమ రాష్ట్రంలో తాగునీటి సరఫరా, చెరువుల నింపడం కోసం వచ్చే ఏడాది ఆగస్టు వరకు 104 టీఎంసీల నీరు అవసరమని ఆంధ్రప్రదేశ్ ఈఎన్‌సీ బోర్డుకు విన్నవించారు. సెప్టెంబరు 3 నాటి నీటి నిల్వల ప్రకారం 66:34 నిష్పత్తిలో తమ వాటాకు రావాల్సిన 97.41 టీఎంసీలను తక్షణమే విడుదల చేయాలని కోరారు.దీనికి భిన్నంగా, నీటి పంపిణీ 50:50 ప్రాతిపదికన జరగాలని తెలంగాణ ఈఎన్‌సీ డిమాండ్ చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014లోని షెడ్యూల్ 12 ప్రకారమే నీటి వినియోగ ప్రాధాన్యతలను నిర్దేశించినట్లు బోర్డు స్పష్టం చేసింది.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com